VISALAANDHRA Phone No. 5301 ఉదయం ★★ Regd No. H. 205

విశాలాంధ్ర

303198

విశాలాంధ్ర
చందా వివరాలు
దినపత్రిక 12 పైసలు, ఆదివారం సంచిక 15 పైసలు

	ఏజంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరానికి	రు. 44—00	రు. 58—00
6 నెలలకు	22—00	29—00
3 నెలలకు	11—25	14—50
నెలకు	3—75	5—00

విశాఖ, కొచ్చిన్, గోవాలలో నౌకా సౌకర్యాల పెంపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

విశాఖపట్నం కొచ్చిన్, గోవాలలో నౌకాసౌకర్యాలను ప్రణాళికా బద్ధంగా పెంపొందించడం జరుగుతుందని నేడు లోక్‌సభలో రక్షణ మంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ వ్రాతపూర్వకంగా తెలియజేశారు.

సంపుటి 20 సంచిక 16 | విజయవాడ 23-4-1970 గురువారం | 6 పేజీలు 12 పై.

యావత్తు మానవ జాతికి చెందిన మహావ్యక్తి లెనిన్

ఢిల్లీలో శత జయంత్యుత్సవ సభలో డాక్టర్ వి. కె. ఆర్. వి. రావు నివాళులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

ప్రపంచంలో ప్రప్రథమ సోషలిస్టు సమాజవ్యవస్థాపకుడైన లెనిన్ మొత్తంమానవజాతికి చెందిన వ్యక్తి అని. మానవజాతి చరిత్రలో గొప్పగా సామాజిక, రాజకీయ పలుకుబడిని గడించిన కొద్దిమంది వ్యక్తులలో ఆయన ఒకరని నేడిక్కడ లెనిన్ శతజయంత్యుత్సవం సందర్భంగా జరిగిన సభను కేంద్ర విద్యామంత్రి డా॥ వి. కె. ఆర్. వి. రావు ప్రారంభిస్తూ నివాళులర్పించారు.

రష్యా విప్లవ మహా నిర్మాత వ్లాదిమిర్ లెనిన్‌కు పెద్ద యెత్తున ప్రజలు జోహార్లు అర్పించారు.

శత జయంత్యుత్సవాలలో భాగంగా యీ సభలో లెనిన్ స్మారక తపాలాబిళ్ళను విడుదలచేశారు.

కొన్ని తపాలాబిళ్ళలతో కూడుకొని ఉన్న ఆల్బంను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి శ్రీ సత్యనారాయణ సిన్హా సోవియట్ రాయబారి యస్. యం. పెగొవ్‌కు ఈ సందర్భంగా బహూకరించారు.

నూతన సమాజం కలను వాస్తవికం చేసిన లెనిన్‌ను మహాత్మా గాంధీతో డా. రావు పోల్చారు. ప్రముఖ వ్యక్తులు, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే నాయకులతో వున్న లెనిన్ శత జయంత్యుత్సవాల కమిటీకి డా. రావు అధ్యక్షులు.

లెనిన్ పైన, సోవియట్ పైన గాంధీ, రవీంద్రనాథఠాగూరు, జవహర్‌లాల్ నెహ్రూ రచనలను ఉటంకిస్తూ గాంధీజీ నాయకత్వం క్రింద భారత జాతీయ ఉద్యమం బ్రహ్మాండంగా పురోగమించిందని సోవియట్ యూనియన్ హర్షామోదాలతో గుర్తించిందని శ్రీ వి. కె. ఆర్. వి. అన్నారు.

భారత జాతీయోద్యమంతో కలిసి మెలిసి పోవలసిందిగాను, స్వాతంత్ర్య పోరాటంలో ఇతర జాతీయ శక్తులతో కలవవలసిందిగా భారత కమ్యూనిస్టులను లెనిన్ కోరారని ఆయన చెప్పారు.

రష్యన్ విప్లవం జరుగుతున్నప్పుడు విప్లవ అనంతరం ఘటనలపట్ల భారతజాతీయ ఉద్యమం నాయకులకు కొన్ని మినహాయింపులున్నప్పటికీ వారు లెనిన్ గొప్పతనాన్ని, ఆయన నాయకత్వం క్రింద నూతన సామాజిక ప్రయోగం ప్రాముఖ్యతను గణనీయంగా హర్షించారని ఆయన తెలిపారు.

లెనిన్ హృదయానికి అత్యంత ప్రియమైన శ్రమజీవుల విముక్తికి మనం పునరంకితం అయినపుడే లెనిన్ జన్మదినాన సరైన జోహార్లు అర్పించి నట్లవుతుందని ఆయన అన్నారు.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలలోని కోట్లాది ప్రజలు యింకా పేదరికం, ఆకలి, ఆర్థిక అస్థిరతలనుండివిముక్తి కాలేదని, మానవుడు మరొక మానవుణ్ణి దోపిడీ చేసే విధానంనుంచి ఆ ప్రజలు యింకా విముక్తులుకాలేదని ఆయన చెప్పారు.

రైటర్స్ భవనంలో బాంబు ప్రేలుడు

కలకత్తా, ఏప్రిల్ 22

పశ్చిమ బెంగాల్ సచివాలయం (రైటర్స్ బిల్డింగ్)లో నేటి మధ్యాహ్నం బాంబు ప్రేలుడు సంభవించింది. కాని భవనానికి ఎలాంటి నష్టం సంభవించలేదు.

సచివాలయంలోని రెవెన్యూశాఖ కార్యాలయంగల అంతస్థులో ఈ బాంబు ప్రేలుడు సంభవించింది. ఆ సమయంలో రాష్ట్ర గవర్నర్ శ్రీ ఎస్. ఎస్. ధావన్ సచివాలయంలో నే ఉన్నారు.

బాంబు స్వాధీనం

మధ్యాహ్నం బాంబు ప్రేలుడు సంభవించిన కొద్దిసేపు అనంతరం సచివాలయం పై కప్పు నుండి క్రికెట్ బంతి సైజులో గల బాంబును స్వాధీనం చేసుకున్నారు.

ఉగ్రవాదుల పిలుపు

కలకత్తా, ఏప్రిల్ 22

అధికార హస్తగతం, సాయుధ పోరాటం వైపు పురోగామిదర్యగా జోతేదార్ల యితర వర్గ శత్రువుల నిర్మూలన ఉద్యమాన్ని విస్తృతం. ఉధృతం చేయవలసిందిగా కమ్యూ

(మిగతా 2 వ పేజీలో)

రాష్ట్రపతి ఎన్నిక కేసు

సాక్షుల విచారణ ముగింపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

రాష్ట్రపతిగా శ్రీ వి. వి. గిరి ఎన్నికను సవాలుచేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటీషన్లపై సాక్షుల విచారణ ఈ రోజుతో పూర్తి అయింది.

ఉత్తరప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కమలాపతి త్రిపాఠీ సాక్ష్యంతో సాక్షుల విచారణను ముగింపుచేశారు.

భారతదేశంలోని అత్యంత ఉన్నత పదవికి సంబంధించిన కేసుపై 5 గురితో కూడిన బెంచి న్యాయ విచారణ జరపడం యిదే ప్రథమం. సాక్షులను విచారించేందుకు దాదాపు రెండుమాసాలు పట్టింది.

పిటీషనర్ల తరఫునగాని లేదా ప్రతివాది శ్రీ గిరి తరఫునగాని 130 మంది ప్రముఖ రాజకీయ వేత్తలు సాక్ష్యాలు యిచ్చారు.

పిటీషనర్ల తరఫున హాజరైన వారిలో సిండికేట్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీయస్. నిజలింగప్ప, మాజీ ఉపప్రధాని శ్రీ మురార్జీ దేశాయ్, రాష్ట్రపతి ఎన్నికలో ఓడిపోయిన శ్రీ యన్. సంజీవరెడ్డి, శ్రీ యస్. కె. పాటిల్, శ్రీమతి తారకేశ్వరీసిన్హాలతోసహా శ్రీముకుల అబ్దుల్ ఘనీ యున్. శ్రీరామారెడ్డిలు ఉన్నారు.

రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి అత్యంత ఉన్నత న్యాయస్థానం ఎదుట సాక్ష్యం యివ్వడానికి స్వయంగా హాజరై చరిత్రను సృష్టించారు.

ప్రతివాది శ్రీ గిరి తరఫున సాక్ష్యమిచ్చిన వారి- అనేక మంది కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, యంగ్ టర్కులు, పార్లమెంటు సభ్యులు ఉన్నారు. వారిలోకాంగ్రెసు అధ్యక్షులు శ్రీ జగజీవన్‌రాం, పారిశ్రామికాభివృద్ధి మంత్రి శ్రీ ఫకృద్దీన్ అలీఅహ్మద్, విదేశాంగమంత్రి శ్రీ దినేష్‌సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ కె రఘురామయ్య సమాచారశాఖ స్టేట్ మంత్రి శ్రీ ఐ. కె. గుజ్రాల్ న్యాయశాఖ ఉపమంత్రి శ్రీ యూనస్ సలీం, మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వి. పి. నాయక్, రాజస్థాన ముఖ్యమంత్రి శ్రీ మోహన్‌లాల్ సుఖాడియా, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ గుర్నాంసింగ్, శ్రీ యుతులు హెచ్. యన్. బహుగుణ, మోహన్ ధారియా చంద్రశేఖర్, చంద్రజిత్ యాదవ్‌లు ఉన్నారు.

ప్రతివాది తరఫున సాక్ష్యం ముగింపుకు సంబంధించి కోర్టులో శ్రీ మోహనకుమారమంగళం లాంఛనప్రాయమైన ప్రకటన చేశారు.

ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీతోసహా మిగతా సాక్ష్యాలను విరమింపజేసుకున్నారు.

నాసిక్ వద్ద మృతుల సంఖ్య 24 కు పెరుగుదల

నాసిక్, ఏప్రిల్ 22

ఇక్కడకు సమీపాన వాణీవద్ద కొండ చరియలు విరిగిపడ ఫలితంగా సంభవించిన ప్రమాదంలో మృతులసంఖ్య 24కు పెరిగింది. మరొక 44 మంది ఆస్పత్రి· చికిత్స పొందుతున్నారు.

హైదరాబాద్‌లో రిలే నిరాహార దీక్షలు

ప్రజాసమితి సభ్యులచే

హైదరాబాద్, ఏప్రిల్ 22

హైదరాబాద్‌లోని 11 కేంద్రాలలో జరుగుతున్న శాంతియుత, దఫాలవారీ నిరాహార దీక్షలో పార్లమెంటుసభ్యులు శ్రీ వి.బి. రాజు, అనేకమంది మున్సిపల్ కౌన్సిలర్లతోసహా 200 మంది నేడు పాల్గొన్నారు. ఈ నిరాహార దీక్షలు ఐదురోజులపాటు కొనసాగుతాయి.

తెలంగాణా ప్రజాసమితి ఈ నిరాహార దీక్షలకు పిలుపు యిచ్చింది.

వరంగల్ లో

వరంగల్ ప్రజాసమితి కార్యకర్తలుకూడ యీ రోజు ఉదయం దఫాలవారి నిరాహార దీక్షలను ప్రారంభించారు.

బాలికలతోపాటు దాదాపు 100 మంది నిరాహారదీక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరాహారదీక్షల కొరకు నగరంలో మూడు శిబిరాలను ఏర్పాటు చేశారు.

30 మంది బాలికలతో దాదాపు 70 మంది వున్న హనుమకొండ దళానికి తెలంగాణా ప్రాంతీయ కమిటీ మాజీ అధ్యక్షులు శ్రీ టి. హయగ్రీవాచారి. శాసనసభ్యులు శ్రీ టి. పురుషోత్తంరావులు నాయకత్వం వహించారు.

హైద్రాబాద్‌లో బ్రహ్మాండమైన ఊరేగింపు

హైదరాబాదు, ఏప్రిల్ 22

"లెనిన్ శతజయంతి' ఉత్సవ సందర్భముగా, జంట నగరాలలోని, కార్మికులు, కమ్యూనిస్టుపార్టీ సభ్యులు, యువజనులు విద్యార్థులు నేడుహిమాయత్‌నగర్‌లోని రాష్ట్రకమ్యూనిస్టుసమితి కార్యాలయము నుండిబ్రహ్మాండమైన ఊరేగింపుగా రామకోటిలోనికి తిలక్ మెమోరియల్ హాలువద్దకు సాయంత్రం గం॥ 6-30 లకు చేరుకున్నారు.

ఎర్రజెండాలు చేపట్టిన కార్మిక జనావళి, అగ్రభాగాన కదంతొక్కుతూ పాటపాడుతూ నడచిన ఊరేగింపు పట్టణప్రజలను ఎంతో ఆకర్షించింది.

మార్క్సిజం లెనినిజం వర్థిల్లాలి." "ప్రపంచ కార్మికులారా - ఏకం కండి" "సోషలిజం వర్థిల్లాలి" "అంతిమ విజయం మనదే" అనే నినాదాలు వ్రాసిన "ప్లేకార్డులు" చేతధరించి "కమ్యూనిస్టు పార్టీ జిందాబాద్"

" దునియాకే మజదూర్.ఏక్ హోజావ్" అని దిక్కులు పిక్కటిల్లేటట్లుగా నినాదాలు చేశారు.

చిత్రాల ఎగుమతి వలన ఆదాయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

1969.70 సంవత్సర కాలంలో స్పెయిన్, దక్షిణ అమెరికా దేశాలకు భారత చిత్రాల ఎగుమతివలన రు. 17.97 లక్షల ఆదాయం వచ్చింది.

1968.69 సంవత్సరంలో చిత్రాల ఎగుమతివలన రు. 10.38 లక్షలు మాత్రమే వచ్చిందని విదేశ వాణిజ్యశాఖ డిప్యూటీ మంత్రి శ్రీరామ్ సేవక్ నేడు లోక్‌సభలో తెలియచేశారు.

అచ్యుతమీనన్‌కు రాజశేఖరరెడ్డి అభినందనలు

విజయవాడ, ఏప్రిల్ 22

కేరళ శాసనసభకు బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుపొందిన శ్రీ అచ్యుతమీనన్‌కు ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖరరెడ్డి నేడు అభినందనలు తెలియచేశారు.

తన అభినందనసందేశంలో శ్రీ రాజశేఖరరెడ్డి యిలా పేర్కొన్నారు. "బ్రహ్మాండమైన విజయాన్ని సాధించినందుకు మీకు, కేరళ కమ్యూనిస్టు సమితికి నా హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను."

న్యాయ స్థానంతో లోక్‌సభ ఘర్షణపడదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

న్యాయస్థానంతో ఘర్షణ పడేందుకు వెనుకాడే వారిలో లోక్‌సభ ప్రథమురాలని స్పీకర్ శ్రీ థిల్లాన్ నేడు పేర్కొన్నారు. అయితే న్యాయమూర్తులు కూడా తమస్థానం ఏమిటో గుర్తించాలని ఆయన పేర్కొన్నారు.

కొంతమంది లోక్‌సభ సభ్యులు జారీ చేసిన నోటీసులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి చిన్న చేసిన వ్యాఖ్యలపై దాదాపు గంటసేపు తీవ్రమైన చర్చ జరిగిన అనంతరం స్పీకర్ పైవిధంగా అన్నారు. విజ్ఞప్తి పూర్వకంగా జారీచేసిన నోటీసు, సమన్లు మాదిరివి కాదని ప్రధాన న్యాయమూర్తి అన్నారు.

సభ్యుల వాదనలను విన్న తరువాత స్పీకర్ మాట్లాడుతూ విజ్ఞప్తి పూర్వకంగా జారీచేసే నోటీసులకు, సమన్లకు తేడా లేదని అన్నారు.

రాజ్యాంగంలోని 105 వ ఆర్టికల్ పార్లమెంటు సభ్యులకు హక్కులు, స్వేచ్ఛ

(మిగతా 2 వ పేజీలో)

నాగిరెడ్డి ప్రభృతులపై కేసు

ఛార్జిషీట్ ఆమోదంకు మేజిస్ట్రేట్ తిరస్కృతి

హైదరాబాద్, ఏప్రిల్ 22

శ్రీ తరిమెల నాగిరెడ్డి, తదితర ఉగ్రవాదులపై ఆరోపించబడిన కుట్ర కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాఖలుచేసిన ఛార్జిషీటు ప్రత్యేక మేజిస్ట్రేట్ అంగీకరించలేదు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ దాఖలు చేసిన పత్రాన్ని ఛార్జిషీటుగా పరిగణించాలా? లేక ప్రైవేట్ కంప్లెయింట్‌గా పరిగణించాలా అనే విషయాన్ని నిర్ణయించేందుకు విచారణను మే5వ తేదీకి వాయిదా వేశారు. శ్రీనాగిరెడ్డి ప్రభృతులపై ఆరోపించబడిన కుట్రకేసును విచారించేందుకు స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటుచేశారు.

చట్టబద్ధంగా ఏర్పాటు చేయబడిన ప్రభుత్వాన్ని కూలద్రోసేందుకు నిందితులు కుట్ర పన్నారనే పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రవేశపెట్టిన పత్రంలో ఆరోపించారు. భూస్వాములపైన, ధనికులపైనా, పలుకుబడిగల వ్యక్తులపైనా దాడులుచేసి, వారిని హత్యచేసి, వారి ఆస్తులను దోచుకునేందుకు శ్రీ నాగిరెడ్డి ప్రభృతులు కుట్ర పన్నారని పేర్కొన్నారు. పోలీసులపై దాడులు చేసేందుకు కూడ ప్రయత్నించారని ఆరోపించారు.

చట్టబద్ధంగా ఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని

(మిగతా 2 వ పేజీలో)

కాంబోడియాలో మూకుమ్మడి హత్యలపట్ల ఆందోళన

లోక్‌సభలో శ్రీ దినేష్‌సింగ్ ప్రకటన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

కాంబోడియాలోని వియత్నాం జాతీయుల మూకుమ్మడి హత్యాకాండ పట్ల విదేశాంగ మంత్రి శ్రీ దినేష్‌సింగ్, భారత ప్రభుత్వ ఆందోళనను లోక్‌సభలో వ్యక్తంచేశారు.

దార్-ఎస్-సలామ్‌లో జరిగిన అలీనదేశాల మహాసభ సన్నాహకకమిటీ సమావేశం విషయమై వచ్చిన కాల్‌ఎటెన్షన్ తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా సభ్యులకు మంత్రి జవాబు చెప్తూ, "కాంబోడియా మూకుమ్మడి హత్యలు దిగ్భ్రమ కొల్పేవిగా వున్నాయనీ, ఆ హత్యలు సిగ్గుచేటయినవని అన్నారు.

కాంబోడియాలో జరుగుతున్న హత్యాకాండ హృదయమున్న ప్రతి మానవుణ్ణి చలింప జేస్తున్నదని అన్నారు. కాంబోడియా ఘటనల పట్ల భారత ప్రభుత్వం తన ప్రగాఢ సంతాపాన్ని, ఆందోళనను వ్యక్తం చేస్తున్నదని అన్నారు.

కాంబోడియాపై ఇండొనేషియా జరప దలచిందని చెప్పబడుతున్న 11 దేశాల మహాసభకు హాజరుకావలసిందిగాకోరుతూ ఇండొనేషియా నుంచి భారత ప్రభుత్వానికి ఇంతవరకు ఆహ్వానం లేదని ప్రశ్నోత్తరాల సమయంలో శ్రీ దినేష్ సింగ్ చెప్పారు.

లావోస్ పరిస్థితిని గురించి చర్చించడానికి అంతర్జాతీయ కంట్రోలు కమిషన్ సమావేశాన్ని భారతదేశం ఏర్పాటు చేయాలని శ్రీ భండగోయిల్ సూచించారు.

జెనీవా ఒప్పందాలకు లోబడి లావోస్ సమస్యా పరిష్కారానికి భారతదేశం ప్రయత్నాలు చేస్తున్నదని అన్నారు.

భారతదేశం చొరవతీసుకోవాలని సభ్యులు కోరగా, ఏ విధంగా చొరవ తీసికోవాలో అర్థంగాకుండా వుందని. ఇండో. చైనా సమస్య రెండు దశాబ్దాలుగావున్న సమస్య గావటంవల్ల అది అనేక చిక్కులు, సమస్యలతో కూడివున్నదని మంత్రి అన్నారు. ఏ చర్య అయినా భారతదేశం ఒంటరిగా తీసుకొనజాలదు. అన్నిపక్షాలసహకారం అవసరం అన్నారు.

లావోస్‌లోని జార్స్ మైదాన ప్రాంతం మీద అమెరికా విమానదాడుల్ని ఖండించాలని శ్రీ హిరేన్ ముఖర్జీ, శ్రీ హేమ్‌బారువాలు కోరగా, ఇండో. చైనా నుంచి విదేశీ సైన్యాలన్నీ వైదొలగాలని భారతదేశం కోరుతున్నదని శ్రీ దినేష్‌సింగ్ స్పష్టం చేశారు.

కాల్‌ఎటెన్షన్‌తీర్మానంపై జరిగిన చర్చలో శ్రీమతితారకేశ్వరిసిన్హా పాల్గొంటూ. అలీనదేశాల మహాసభలో దక్షిణ వియత్నాం తాత్కాలిక విప్లవ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం యివ్వరాదని అన్నారు. దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం యివ్వటానికి అంగీకరించితే, మిజో. నాగా తిరుగుబాటు దార్లకు కూడా ప్రాతినిధ్యం యివ్వాలని కొందరు కోరవచ్చునని అన్నారు.

అలీనదేశాల మధ్య ఆర్థిక సహకారానికి ఎక్కువ ప్రాధాన్యం యివ్వటం, మిగిలిన దేశాలతో మన ఆర్థికసంబంధాలు దెబ్బ తినవా? అని శ్రీ మధోక్, శ్రీమతి సిన్హాలు ప్రశ్నించారు.

తూర్పుపాకిస్తాన్‌లో మైనారిటీలపట్ల పాక్ ప్రభుత్వం అవలంబిస్తున్న వివక్షణా వైఖరి గురించి భారత ప్రభుత్వం ఎందుకు సన్నాహక సమావేశంలో ప్రస్తావించలేదని శ్రీ సమర్ గుహ ప్రశ్నించారు.

కాంబోడియా ప్రాతినిధ్యం విషయమై ఉభయవర్గాల వాదనలు వినటానికి చిన్న కమిటీని ఏర్పాటు చేయాలనీ, ఆ తర్వాత విస్తృత సమావేశంలో ప్రాతినిధ్యం విషయం తేల్చ వచ్చునని భావించారని దినేష్‌సింగ్ ఒక ప్రశ్నకు జవాబు చెప్పారు.

అమెరికా గూఢచారిశాఖ చెప్పుచేతల్లో వున్న కాంబోడియా సైనిక ప్రభుత్వం సాగిస్తున్న హత్యాకాండను ఆపాలని శ్రీ జ్యోతిర్మయిబాసు కోరారు.

నక్సలైట్ల చర్యల అణచివేతకు చట్టం తీసుకవచ్చేయోచన

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యవర్గంలో ప్రధాని వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

నక్సలైట్ల కార్యకలాపాల అణచివేతకు చట్టాన్ని తీసుకవచ్చే అవకాశాన్ని గురించి కేంద్రం పరిశీలిస్తున్నదని నేడిక్కడ పార్లమెంటరీ కాంగ్రెస్‌పార్టీ కార్యవర్గ సమావేశంలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ తెలియజేసినట్లు తెలుస్తున్నది.

ఐ. సి. యస్. అధికార్ల ప్రత్యేక సౌకర్యాలు మారిన పరిస్థితులకు అనుగుణంగా లేనికారణంగా వాటి రద్దుకు యస్. యస్.పి. నాయకులు మధులిమాయేబిల్లును ప్రభుత్వం బలపర్చాలని కార్యవర్గం అంతకుముందు [illegible]యించింది.

కాంగ్రెస్ చీలికకుముందుకూడ ఈ విషయాన్ని కార్యవర్గం చర్చించిందని, ప్రత్యేక సౌకర్యాలరద్దుకు అనుకూలమైన అభిప్రాయం వ్యక్తమైందని ప్రధాని అన్నారు.

రాజ్యాంగంలో ఇందుకు సంబంధించిన అంశాలను తీసివేసినంతమాత్రాననే ఐ. సి. యస్. అధికార్ల ప్రత్యేక సౌకర్యాలు రద్దు కావు. ద్వైపక్ష ఒప్పందం వలన ఐ. సి. యస్. అధికార్లు అనుభవిస్తున్న ప్రత్యేక సౌకర్యాలను సవరించడానికి చట్టబద్ధ చర్య అవసరమవుతుందని ఆమె చెప్పారు.

శ్రీ మధులిమాయే బిల్లు ఆమోదం పొందడానికి హాజరైన సభ్యులలో 2/3 వంతు మెజారిటీ, 50 శాతం సభ్యుల హాజరు అవసరమని పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి.

ఐ.సి యస్. ఐ. ఎ. యస్. అధికార్లకు సంబంధించిన పరిస్థితులలో ఏకీకృత విధానానికి సంబంధించిన చట్టాన్ని తీసుకువచ్చే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఆ వర్గాలు తెలిపాయి.

ఐ. సి. యస్. అధికార్ల తెలివి తే. వినియోగించు కోవాలనే సంకల్పం

(మిగతా 2వ పేజీలో)

మార్క్సిస్టునాయకుల లెనినిస్టు వ్యతిరేక పంథా : గన్నవరం సభలో శ్రీ రాజశేఖర్ విమర్శ

గన్నవరం, ఏప్రిల్ 22

(విశాలాంధ్ర విలేకరి)

కార్మికవర్గ ప్రభుత్వాన్ని స్థాపించేందుకు కార్మికవర్గ ప్రధాన శత్రువును ఏకాకిని చేసేందుకు, మిగిలిన వారినందరినీ కలుపుకు రావాలని లెనిన్ మహాశయుడు ప్రబోధించగా "మేం కలవం" "మేం తప్ప అందరూ ప్రజా శత్రువులే, కాబట్టే మేమే ఒంటరిగా ఉండాల్సి వచ్చింది. మేమెంత ఒంటరిగా ఉంటే అంత పవిత్రులం" అని మార్క్సిస్టు నాయకులు చెప్పుకుంటూ, తమ విధానాల ద్వారా కార్మికవర్గాన్ని ఏకాకిని చేసేందుకే పని చేస్తున్నారని రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖరరెడ్డి ఇక్కడ నిశితంగా విమర్శించారు.

లెనిన్ శతజయంతిసందర్భంగా గన్నవరం తాలూకా కమ్యూనిస్టు సమితి ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంవద్ద నిన్న జరిగిన బ్రహ్మాండమైన బహిరంగసభలో ప్రసంగిస్తూ ఆయన పై విధంగా చెప్పారు.

ఐక్యసంఘటన అంటే ప్రజల్లో ఏర్పడిన గొప్ప అభిప్రాయాన్ని పోగొట్టడానికి కారకులైన మార్క్సిస్టులు: కలిసొచ్చే వారందర్నీ ఆ రెల్లలో దూరంచేసుకుని తాము పవిత్రులం అని సిద్ధాంతం చేస్తున్నారని శ్రీ రాజశేఖరరెడ్డి విమర్శించారు.

శత్రువుల శిబిరం ఐక్యమయ్యే విధానం, మిత్రుల శిబిరం విచ్ఛిన్నమయ్యే విధానాన్ని వారు చేపడుతున్నారని చెప్పారు.

సభకు తాలూకా కమ్యూనిస్టు సమితి నాయకులు శ్రీ గొంది వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు.

శ్రీ రాజశేఖర్ తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు. "ప్రపంచ శ్రమజీవుల నాయ

(మిగతా 2 వ పేజీలో)



లెనిన్‌కు ప్రపంచ కమ్యూనిస్టు నాయకుల నివాళి

క్రెమ్లిన్‌లో ఆరువేల మందితో సభ

మాస్కో, ఏప్రిల్ 21

విప్లవోద్యమనేత, ప్రప్రథమ సోషలిస్టు రాజ్య సంస్థాపకుడైన లెనిన్ మహాశయుని శతజయంత్యుత్సవాల సందర్భంగా నేడు క్రెమ్లిన్‌లో జరిగిన బ్రహ్మాండమైన సభలో ప్రపంచ కమ్యూనిస్టు నాయకులు లెనిన్‌కు నివాళులర్పించారు.

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి బ్రెజ్నెవ్, ప్రధాని అలెగ్జీ కొసిగిన్, దేశాధ్యక్షుడు నికొలయ్ పోద్గొర్నీతో సహా 11 మంది సోవియట్ పొలిట్ బ్యూరో సభ్యులు వేదికపైకి రాగానే 6 వేల మంది సోవియట్ కమ్యూనిస్టు నాయకులు, ప్రజలు, 70 దేశాల కమ్యూనిస్టుపార్టీల నాయకులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు.

విదేశాల ప్రతినిధివర్గాల నాయకులను పరిచయం చేయడంతో పోద్గొర్నీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వీరిని పరిచయం చేయడానికి 30 నిముషాలు పట్టింది.

విదేశ కమ్యూనిస్టు నాయకులలో తూర్పు జర్మనీ నాయకుడు వాల్టర్ ఉల్‌బ్రిక్ట్, చెకొస్లొవేకియా పార్టీ అధ్యక్షుడు గుస్తావ్ హుసాక్ వున్నారు.

మాస్కో నగరమంతా ఎర్రని తోరణాలతో, 1917 లో బోల్షివిక్ విప్లవాన్ని నడిపిన మహా మేధావి లెనిన్ చిత్రాలతో కన్నుల పండువగా అలంకరించారు.

అధికార పత్రికలన్నీ మొదటి పేజీలలో లెనిన్ చిత్రాలను, ప్రశంసా వ్యాసాలను ప్రచురించాయి.

రేపు జరిగే లెనిన్ శతజయంత్యుత్సవం "సమకాలీన చరిత్రలో అత్యంత చిరస్మరణీయమైన వేడుకలలో ఒకటి" అని టాస్ అభివర్ణించింది.

నేడు క్రెమ్లిన్‌లో జరిగిన ఉత్సవానికి పోద్గొర్నీ అధ్యక్షత వహించారు. ఆయనకు కుడి పైపున బ్రెజ్నెవ్, ఎడమపైపున కొసిగిన్‌లు ఆసీనులైనారు.

66 కమ్యూనిస్టుపార్టీల ప్రతినిధి వర్గాలు 6 వేల మంది ప్రజలు హాజరైన ఈ ఉత్సవానికి చైనా ప్రతినిధి మాత్రం రాలేదు. శతజయంత్యుత్సవాలు రెండురోజులు జరుగుతాయి.

బ్రెజ్నెవ్ ప్రసంగం

సోవియట్ కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి లియొనిడ్ బ్రెజ్నెవ్ మూడుగంటల 10 నిముషాలు ప్రసంగించారు. సోవియట్ అభివృద్ధిని, విదేశాంగ విధానాన్ని, ఆయన కూలంకషంగా వివరించారు.

సోషలిస్టు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడాలని, ప్రస్తుతం సంబంధాలు దెబ్బతిన్న సోషలిస్టు దేశాలలో సత్సంబంధాలు పునరుద్ధరణకు సోవియట్ యూనియన్ కృషి చేస్తుందని బ్రెజ్నెవ్ హామీ యిచ్చారు.

ప్రపంచంలోని రెండు పెద్ద కమ్యూనిస్టు దేశాల మధ్య సత్సంబంధాలు లేకపోవడానికి చైనాయే కారణమని పేర్కొన్నారు.

ఇటీవల సంవత్సరాలలో చైనా జరిపిన సోవియట్ వ్యతిరేక దుష్ప్రచారం వలన సోషలిస్టు శత్రువులు మాత్రమే లాభపడ్డారని బ్రెజ్నెవ్ స్పష్టీకరించారు.

చైనా-సోవియట్ ఉద్రిక్తతలవలన కొన్ని సందర్భాలలో సోషలిస్టు దేశాల మధ్య సహకారం తీవ్రంగా దెబ్బ తిన్నదన్నారు.

సోవియట్-చైనా సరిహద్దు వివాదాలపై పెకింగ్‌లో అనేక మాసాలుగా జరుగుతున్న చర్చలను ఆయన ప్రస్తావించారు.

ఆయుధ పోటీని ఆపడానికి, చర్చల ద్వారా ఇతర అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి సోవియట్ యూనియన్ కృషి చేస్తుందన్నారు.

పరస్పర లాభదాయకమైన సహకారాన్ని పెంపొందించుకునేందుకు సోవియట్ యూనియన్ సిద్ధంగా వున్నదని, పశ్చిమ దేశాలలోని వాస్తవ దృష్టిగల ఆలోచనపరులు విశ్వసించ వచ్చునన్నారు.

సోవియట్ యూనియన్ అత్యంత ఆధునిక ఆయుధాలతో తన రక్షణ బలగాన్ని పటుతర మొనర్చుతున్నదని చెప్పారు.

వినాశకరమైన ఆయుధ పోటీని ఆపు చేయడానికి, నిరాయుధీకరణను సాధించడానికి, వివిధ దేశాలమధ్య అపరిష్కృతంగా వున్న సమస్యలను సహేతుకమైన ప్రాతిపదికపై పరిష్కరించడానికి తాము క్రియాశీలమైన ప్రయత్నాలను కొనసాగిస్తామన్నారు.

ఫాసిస్టు జర్మనీపై విజయం సాధించిన 25 వ వార్షికోత్సవాన్ని తాము త్వరలో జరుపుకోబోతున్నామని తెలిపారు.

సోవియట్ యూనియన్‌కు నూతన ఆర్థిక విధానాన్ని రూపొందించడానికి ఇది సమయమని పార్టీ కేంద్రకమిటీ, ప్రభుత్వమూ విశ్వసిస్తున్నాయని బ్రెజ్నెవ్ చెప్పారు.

దేశ ఆర్థిక చిక్కులకు ప్రధానంగా ప్రణాళిక లోపాలే కారణమన్నారు. ఇందువలన తమ ప్రణాళిక పద్ధతులను నిరంతరం సరిదిద్దవలసి వుందన్నారు.

"పలు సంవత్సరాలు ముందుగా ప్రణాళికలను వేసుకొనేందుకు మనం భయపడరాదు" అన్న లెనిన్ మాటలు బ్రెజ్నెవ్ ఉటంకించారు.

"మనం పార్టీ 24వ మహాసభను, నూతన పంచవర్ష ప్రణాళికను ప్రారంభించాల్సిన దశలో వున్నాం. దేశ ఆర్థిక వ్యవస్థ చాలా జటిలమైనది దానికి మార్గం చూపడంకూడా మనందరి జటిలమైన కర్తవ్యం" అని ఆయన అన్నారు.

సోషలిస్టు దేశాల ప్రయోజనాల రక్షణకు వార్సా దేశాల సంధిని పటుతరం మొనర్చుకునేందుకు సోవియట్ యూనియన్ సర్వవిధాల కృషి చేస్తున్నారు.

వ్యక్తి పూజ, వైయక్తిక తత్వం పట్ల ఆయన అవగాహన, వ్యక్తీకరణ ఎంతో అధ్యయనంతో కూడినవి. నేడు సైతం లెనిన్ సిద్ధాంతాలు, ప్రజల సంతోషాల కొరకు పోరాడుతున్న వారికి శక్తివంతమైన ఆయుధంగా వున్నవి అని బ్రెజ్నెవ్ అన్నారు.

విప్లవ నేత

లెనిన్, మహా మేధావి, విప్లవకారుడు, ప్రపంచకమ్యూనిస్టు ఉద్యమానికినాయకత్వం వహించేందుకుఆయనఅభిప్రాయాలు సహాయపడతాయి అని బ్రెజ్నెవ్ ప్రశంసించారు.

ఈ సందర్భంగా క్రెమ్లిన్‌లో 40 అడుగుల ఎత్తుగల లెనిన్ చిత్రాన్ని ఆవిష్కరించారు.

అక్టోబరు సోషలిస్టు మహా విప్లవాన్ని ఉత్తేజపరచి, నిర్వహించిన లెనిన్ పేరు మానవేతిహాసంలో మహత్తరమైన మలుపు, పెట్టుబడిదారీ వ్యవస్థ నుండి సోషలిస్టు వ్యవస్థతో ముడిపడి వుంది అని అన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీలు: సిండికేట్ హర్షం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మైసూరు రాష్ట్రాలలో ఉక్కు ఫ్యాక్టరీలను నెలకొల్పాలన్న ప్రభుత్వ నిర్ణయంపట్ల సిండికేట్ పార్లమెంటరీపార్టీ కార్యవర్గం నేడు తన హర్షాన్ని ప్రకటించింది.

ఉక్కు ఫ్యాక్టరీలను నెలకొల్పాలని తమ పార్టీ పెక్కు సంవత్సరాలుగా చేస్తున్న డిమాండ్ కనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం జరిగిందని శ్రీ రాంసుభగ్‌సింగ్ అన్నారు. సేలంలో ఉక్కుఫ్యాక్టరీ కావాలని తమిళనాడు సిండికేట్ కోరిందని, హాస్పేటలో ఉక్కుఫ్యాక్టరీని నిర్మించాలని మైసూరు ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నదని ఆయన అన్నారు.

విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీని నెలకొల్పాలని శ్రీ సంజీవరెడ్డి ఉక్కు శాఖా మంత్రిగా వున్నప్పుడు సూచించారని శ్రీ రాంసుభగ్ సింగ్ అన్నారు.

ఎరువుల పంపిణీని గూర్చి గూడా కార్యవర్గం చర్చించింది.

నూతన ఉక్కు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయుట వలన ప్రభుత్వం ఇంతకు పూర్వం చేసిన పొరపాట్లు సర్దుబాటు కావచ్చని కార్యవర్గం భావించింది.

ప్రత్యేక సౌకర్యాల రద్దుకు మద్దతు

ఐ. సి. యస్. ఉద్యోగులకుగల ప్రత్యేక సౌకర్యాలను రద్దు చేయుటను సిండికేట్ కార్యవర్గం తన మద్దతును ప్రకటించింది.

అయితే పెక్కుమంది సభ్యులు యిందుకు తీవ్రంగా తమ అభ్యంతరాన్ని తెలిపారు.

యస్. యస్. పి సభ్యుడు శ్రీ మధులిమాయె ప్రవేశపెట్టిన బిల్లు (ఐ. సి. యస్. ఉద్యోగుల ప్రత్యేక సౌకర్యాల రద్దు)కు మద్దతు ప్రకటించుటలో పార్టీ త్వరపడినాదని శ్రీ యస్. కె. పాటిల్ అన్నారు.

ఐ. సి. యస్. ఉద్యోగుల ప్రత్యేక సౌకర్యాలను రద్దుచేయుటకు మద్దతు యివ్వాలని శ్రీ పి. వెంకట సుబ్బయ్య, శ్రీ మొరార్జి దేశాయి, శ్రీమతి తారకేశ్వరిసిన్హాలు గట్టిగా వాదించారు.

కామరాజ్ విజ్ఞప్తి

సిండికేట్ కాంగ్రెసును క్రియాశీలమైన ప్రజా పునాదిగల పార్టీగా రూపొందించుటకు కృషి చేయాలని శ్రీ కామరాజ్ నేడు విజ్ఞప్తి చేశారు.

పథకాల వలన కాంగ్రెసుపార్టీ చీలలేదని వ్యక్తిగత ద్వేషంవలన పార్టీ చీలిపోయిందని ఆయన అన్నారు.

వేసవి తరగతులు
క్లాసులు ఏప్రియల్ 27నుండి జూన్ 1 వరకు
అడ్వాన్సు ఇంటర్‌మీడియట్,పియుసి
(తెలుగు, ఇంగ్లీషు మీడియమ్సు)
'70 సెప్టె. పి.యు.సి.,X క్లాసు S.S.L.C. అభ్యర్థులకు
ప్రాక్టికల్సు సదుపాయము హాస్టలు,రిక్షాసదుపాయముగలవు.
శాంతా ట్యుటోరియల్ కాలేజి
ఫోన్:21522 : బ్రాడీపేట గుంటూరు-2.

అచ్యుతమీనన్ విజయం పట్ల పలువురి హర్షం

తిరువనంతపురం, ఏప్రిల్ 21

కొట్టారక్కర, నీలంబూర్ ఉప ఎన్నికల ఫలితాలు మార్క్సిస్టులకు చావుదెబ్బలు లాంటివని కేరళ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ యస్.కుమారన్ నేడిక్కడ అన్నారు.

ప్రభుత్వాన్ని కూలద్రోయుటకు విదేశీ తోటల యజమానులతోను, గుత్తపెట్టుబడిదారుల, వ్యాపారులతోను కుమ్మక్కయిన మార్క్సిస్టులకు యిది చావుదెబ్బ అని ఆయన అన్నారు.

ప్రస్తుత ఎన్నిక ఫలితాల వలన రాష్ట్ర రాజకీయ రంగంలో నూతన పరిస్థితి ఏర్పడిందన్నారు.

తంగల్

రాష్ట్రంలో ఇక ముందు జరిగే ఎన్నికలలో మార్క్సిస్టుల భవిష్యత్తును నీలంబూరు ఉప ఎన్నిక చూపిస్తున్నదని కేరళ ముస్లింలీగ్ అధ్యక్షుడు శ్రీ సయ్యద్ అబ్దుల్ రహిమాన్ బఫాకి తంగల్ అన్నారు.

"నీలంబూరు తమకు బలమైన కేంద్రమని మార్క్సిస్టులు చెప్పుకున్నారు. ఇప్పుడు ఆ కోటను మేం స్వాధీనపరచుకున్నాం" అని శ్రీ తంగల్ అన్నారు.

సుబ్రహ్మణ్యం

ప్రగతిశీల ప్రజాతంత్ర శక్తులకు ఇది విజయమని శ్రీ సుబ్రహ్మణ్యం వ్యాఖ్యానించారు.

కేరళ రాజకీయ పరిస్థితిలో మార్పు కలుగుటకు యిది దోహదం చేయగలదని తాను ఆశిస్తున్నానన్నారు.

నంబూద్రిపాద్

కొట్టారక్కర, నీలంబూరు ఉపఎన్నికలలో ఐక్యసంఘటనకు వ్యతిరేకంగా పోలైన ఓట్లు మార్క్సిస్టుపార్టీకి, వారి మిత్రులకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని శ్రీ నంబూద్రిపాద్ అన్నారు.

బలమైన ప్రజాతంత్ర ఫ్రంట్‌ను ఏర్పాటు చేయుటకు ఉప ఎన్నిక ఫలితాలు ఉత్తేజాన్ని కల్పిస్తున్నాయని ఆయన అన్నారు.

ప్రజలకు దూరమౌతున్న మార్క్సిస్టులు

మార్క్సిస్టులు ప్రజలకు దూరమౌతున్నారని ప్రస్తుత ఉపఎన్నిక ఫలితాలుసూచిస్తున్నాయని కేరళ కాంగ్రెసు అడ్‌హాక్ కమిటీ కన్వీనర్ శ్రీ కె. కె. విశ్వనాథన్ అన్నారు.

సిండికేట్‌కు ప్రజలలో బలంలేదని, ఒక రాజకీయ పార్టీగా తనను గుర్తింపుపొందుటలో విఫలమైందని రుజువయిందన్నారు.

కరుణానిధి అభినందన

కొట్టారక్కర ఉప ఎన్నికలో విజయం సాధించినందుకు శ్రీ అచ్యుతమీనన్‌కు తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి తన అభినందనలు తెలియజేశారు.

మాధవన్‌నాయర్

ప్రస్తుత ఐక్యసంఘటన పరిపాలనను ప్రజలు ఆమోదించారని ఈ ఉపఎన్నిక ఫలితాలు రుజువుచేశాయని పి. యస్. పి. శాసన సభ్యుడు శ్రీ మాధవన్‌నాయర్ అన్నారు.

ప్రజల విశ్వాసం దృఢీకరణ

కొట్టారక్కర, నిలంబూర్ ఉపఎన్నికల ఫలితాలు ప్రస్తుత ఐక్యసంఘటన ప్రభుత్వంపట్ల ప్రజలలో వున్న విశ్వాసాన్ని దృఢీకరించాయని ఐక్య సంఘటన పార్టీల నాయకులు వ్యాఖ్యానించారు.

ఈ ఉప ఎన్నికలు ముగియుటంతో 134 సభ్యులుగల కేరళ శాసనసభలో ఐక్య సంఘటన బలం 67 నుండి 69 కి పెరిగింది. ఈ ప్రభుత్వాన్ని బయటనుండి ఇండిపెండెంట్లు, బయటనుండి కాంగ్రెస్ సభ్యులు బలపరుస్తున్నారు.

మార్క్సిస్టు పార్టీకి బలీయమైన కేంద్రమైన నిలంబూరు నియోజక వర్గంలో ఆ పార్టీ అభ్యర్థి ఓటమి పొందటంతో మార్క్సిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది.

రెండు నియోజక వర్గాలలోను సిండికేట్ అభ్యర్థులకు డిపాజిట్ గల్లంతు అయింది.

శాసన సభలో బలాబలాలు

ప్రస్తుతం శాసన సభలో బలాబలాలు యిలా వున్నవి:

కమ్యూనిస్టుపార్టీ - 21, ముస్లింలీగ్-14, పి యస్.పి. - 8. పి. యస్. పి. అసమ్మతి వర్గీయులు - 3 ఆర్. ఎస్. పి -6. కేరళ కాంగ్రెసు-5, కె. కె. పి. - 1, కర్షక సమితి, 2 మార్క్సిస్టుపార్టీ - 49. ఎస్. ఎస్. పి -4. కె. టి. పి -1. సిండికేట్ 4 కాంగ్రెస్-5, విప్లవ కమ్యూనిస్టులు - 2 ఇండిపెండెంట్లు - 7, నామినేటెడ్ - 1 ఒక స్థానం ఖాళీగా వుంది - మొత్తం 134.

ఈ ఉపఎన్నికల ఫలితాలు తమ అంచనాను మించడంతో ఐక్యసంఘటన వర్గాలలో బ్రహ్మాండమైన ఉత్సాహం కనబడుతున్నదని పి. టి. ఐ. తెలుపుతున్నది.

ఎన్నికల్లో గెలిస్తే బ్యాంకుల జాతీయం

శ్రీమతి బండారు నాయికే ప్రకటన

కొలంబో, ఏప్రిల్ 21

ఎన్నికల్లో ఐక్య సంఘటన గెలిచిన పక్షంలో బ్యాంకులను జాతీయం చేస్తామని సింహళ మాజీ ప్రధాని శ్రీమతి సిరిమావో బండారు నాయికె ప్రకటించారు.

ఈ సంఘటనలో సోషలిస్టులు, కమ్యూనిస్టులు, మార్క్సిస్టులు వున్నారు.

సాధారణ ఎన్నికల ఫలితాలు మే 7 వ తేదీన ప్రకటిస్తారు.

జాతీయంచేసే బ్యాంకులు ఎనిమిదింటిలో ఐదు బ్రిటన్, రెండు భారత్, ఒకటి పాక్‌కు చెందినవి.

ఢిల్లీలో అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

న్యూఢిల్లీలో మూడవ ఆసియా అంతర్జాతీయ ప్రదర్శన జరిపేందుకు భారత్ చేసిన ప్రతిపాదనను ఎస్కాఫ్ అంగీకరించే అవకాశం వున్నది.

ఈ విషయాన్ని యీ రోజు లోక్‌సభలో విదేశ వాణిజ్య శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ రామ్‌సేవక్ వ్రాతపూర్వకంగా తెలియ చేశారు.

నాంపెన్ చేరువలో విముక్తి దళాలు

సాంగ్, ఏప్రిల్ 22

నాంపెన్‌కుదక్షిణంగా 18 మైళ్ళదూరంలో గల సాంగ్ పట్టణంపై విముక్తిదళాలు నేడు కాంబోడియామాజీఅధినేత సిహనౌక్ జెండాను ఎగురవేశాయి.

ఈ నగరంపై దాడిచేసేందుకు కాంబోడియా ప్రభుత్వ సైన్యాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

విముక్తిదళాలు సిహనౌక్ బొమ్మగల బ్యాడ్జీలను ధరించి వున్నాయని సాంగ్‌పట్టణం నుండి వార్తలందాయి.

వియత్నామీయుల నిర్బంధం

నాంగ్‌నగరంలో తల దాచుకునేందుకు వెళ్లుతున్న 90 మంది వియత్నామీయులను కాంబోడియా సైన్యాలు నిర్బంధ శిబిరంలోకి పంపించారు.

వారిని ఏమి చేశారో ఇంతవరకు తెలియ రాలేదు.

ఈ ప్రాంతాలలో రోడ్లపై 30 మంది వియత్నాం జాతీయుల శవాలు కనిపించాయని ప్రత్యక్షంగా చూచినవారు చెబుతున్నారు.

సైన్యాలఉపసంహరణ ప్రకటనలో కుట్ర

నిక్సన్ ప్రకటనపై టాస్ వ్యాఖ్య

మాస్కో, ఏప్రిల్ 21

వియత్నాంనుండి 150,000 మంది సైనికులను ఉపసంహరించుకుంటానని అమెరికా ప్రకటించినప్పటికీ, యింకా మిగిలివుండే సైనికుల సంఖ్యను పరిశీలించినచో యుద్ధాన్ని విరమించాలనే ఉద్దేశం అమెరికాకు లేదని సోవియట్ వార్తాసంస్థ టాస్ నేడు ప్రకటించింది.

సైన్యాల ఉపసంహరణపై నిక్సన్ చేసిన ప్రకటనపై సోవియట్ ఈ వ్యాఖ్యానం చేసింది.

ఆగామి కాలంలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ప్రజాభిప్రాయానికి లొంగి అధ్యక్షుడు నిక్సన్ సైన్యాల ఉపసంహరణ గావించారని టాస్ పేర్కొన్నది.

రానున్న 12 నెలల్లో 150,000 మంది సైనికులను ఉపసంహరించినప్పటికీ యింకా వియత్నాంలో 284,000 మంది అమెరికా సైనికులు వుంటారని టాస్ తెలియజేసింది.

వియత్నామీకరణ, అనే తన విధానాన్ని నిక్సన్ పునరుద్ఘాటించారు. దాని అర్థం సైగాన్ కీలుబొమ్మ ప్రభుత్వం ద్వారా యుద్ధాన్ని కొనసాగించటమేనని ఆ వార్తా సంస్థ తెలిపింది.

రైల్వే కార్మికుల ప్రదర్శన

హైదరాబాద్, ఏప్రిల్ 21

లాలాగూడా వర్క్‌షాపులకు చెందిన 4 వేల మంది రైల్వే కార్మికులు గత గురువారంనాడు లాలాగూడనుండి పెద్దప్రదర్శన జరిపారు, తరువాత డివిజనల్ సూపరింటెండెంటు కార్యాలయం ఎదుట సభ జరిపారు.

అఖిల భారత "నిరసనదినం" సందర్భంగా ఈ ప్రదర్శన, సభ ఏర్పాటుచేయుటం జరిగింది.

మూడు, నాలుగు తరగతుల ఉద్యోగులకు పై గ్రేడు యివ్వటానికి నిరాకరించినందుకు, లోకోషెడ్లు, క్యారేజి, వాగన్లు డిపోలు, విద్యుచ్ఛక్తి, సిగ్నలింగ్ డిపోలు, ముద్రణా కార్యాలయంలో గ్రేడు పెంపుదలను అసలు పరిశీలించకపోవటానికి నిరసనగా "నిరసన దినాన్ని" పాటించారు.

విమానం కూలి 33 మంది మృతి

మనీలా, ఏప్రిల్ 21

లుజాన్‌లో విచ్ఛిన్నమైన ఒక ఫిలిప్పైన్ విమానం కూలిపోవటంతో 33 మంది మరణించారు.

మనీలాలో యీ దుర్ఘటన జరిగింది.

విమానంలో గల నల్గురు సిబ్బందితోపాటు ప్రయాణీకులు అందరూ మరణించారు.

రాజశేఖర్ విమర్శ

(1 వ పేజీ తరువాయి)

కుడైన లెనిన్ శత జయంతి" ప్రపంచమంతటా జరుగుతోంది.

ఈ సందర్భంగా లెనిన్ సిద్ధాంతాలను అర్థం చేసుకుని, ఉద్యమాన్ని నడుపుతున్నామా ? అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి ప్రస్తుత దేశరాజకీయ పరిస్థితులను ఆలోచించుకోవాలి.

22 ఏళ్ళుగా కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోరాడటంలో చాలావరకు ఓటమినే పొందటంతో కొందరు నిరుత్సాహంతో రాజకీయాలనుండి నిష్క్రమించటం, మరికొందరు అర్జంటుగా విప్లవం తెచ్చేందుకు తుపాకి విధానం చేపట్టటం జరిగాయి.

ఈరోజున కాంగ్రెస్ చీలింది. ఏ కాంగ్రెసూ దేశాన్ని అవిచ్ఛిన్నంగాపాలించే స్థితిలో లేదు. ప్రతిపక్షాలలో అండతోనే కేంద్రంలో ఇందిరాగాంధి నిలబడివున్నారు.

ఎలాటిప్రభుత్వం పాలనలోకి రావాలిఅన్న విషయాన్ని ఇప్పుడుప్రజలునిర్ణయించాలి. మితవాద,మతవాదపార్టీల ప్రభుత్వమా లేకవామ పక్ష,ప్రజాతంత్రపార్టీల ప్రభుత్వమా అన్నది తేల్చాల్సి వుంది.

కాంగ్రెస్‌లో చీలికకు కారణమేమిటో శ్రీ రాజశేఖర రెడ్డి వివరిస్తూ. రాష్ట్రపతి పదవికి జరిగినపోటీ వెనుకనున్న శక్తులను గూర్చి తెలిపారు.

ఇందిరాగాంధి ద్వారా సోషలిజం వస్తుందనటం ఎంత పొరపాటో, ఇందిరాగాంధి సిండికేట్‌లకు తేడా లేదనటం అంతే పొరపాటన్నారు

'అతివాదపార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పరచగలిగే స్థితిలో ఉన్నప్పుడు ఆమెనుపడగొట్టవచ్చు ఆ రెండు కాంగ్రెస్‌లకు వ్యత్యాసముందని మార్క్సిస్టులు ఆచరణలో గుర్తించటలే, ప్రభుత్వానికి అనుకూలంగా ఓటేస్తున్నారని, గుర్తించినపుడు దానిని అంగీకరిస్తే తప్పేమిటి? దాన్ని తప్పులాగా, రహస్యంగా దాచుకోవటం ఎందుకు అని ఆయన ప్రశ్నించారు.

అతివాదపార్టీలఐక్యసంఘటనే కమ్యూనిస్టుపార్టీ ధ్యేయం

అతివాద ప్రజాతంత్రపార్టీల ఐక్యసంఘటనను ఏర్పాటు చేయుటమే కమ్యూనిస్టుపార్టీ ధ్యేయం. అందుకోసం అనుమానాలు, పిడివాద సిద్ధాంతాలతో ఎవరెన్ని అవరోధాలు కల్పించినా, ఐక్యతేవద్దనే వారి చేతుల్లో భంగపాటు వచ్చినా, అందుకు ప్రజా సహకారంతో కమ్యూనిస్టుపార్టీ కృషిచేస్తుంది అని శ్రీ రాజశేఖరరెడ్డి ఉద్ఘాటించారు.

ప్రజల్లో ఐక్యసంఘటన అంటే వున్న గౌరవ,అభిప్రాయాన్ని నాశనంచేసి ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలుచేసి, విధ్వంసం చేయుటం మార్క్సిస్టులు చేసిన చాలా పెద్దనేరం.

రెండు కమ్యూనిస్టుపార్టీలు కలవవు. కలవవు అంటూ చెప్పటం కమ్యూనిజంకాదు. మార్క్సిజంకాదు. లెనినిజం కాదు. అవసరం వచ్చినపుడు మార్క్సిస్టులు గన్నవరం ఎన్నికల్లోను, గుడివాడ ఎన్నికల్లోను మా సహాయాన్ని ఇచ్చాం.

రెండు పార్టీలమధ్య శాసన మండలి రాజ్యసభ స్థానాలకు ఒప్పందం జరగటం వంటివి సంతోషకరమైనవి కావా ?

"మేం శుద్ధ విప్లవ వాదులం, మేం ఎవరితోను కలవం అని చెప్పుకోవటమేనా ఈ క్లిష్ట దశలో చేయాల్సిన సేవ" అని శ్రీ రాజశేఖర్ సూటిగా ప్రశ్నించారు.

ప్రజలే పట్టుపట్టి కమ్యూనిస్టు ఉద్యమాన్ని కలుపుతారన్నది మా విశ్వాసం. అని అన్నారు.

కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ దాసరి నాగభూషణరావు ప్రసంగిస్తూ నెహ్రూ, గాంధీ, సుభాస్‌చంద్రబోసులపై లెనిన్ ప్రభావం, ఆయన నిర్మించిన సోషలిస్టు సమాజ ప్రభావాన్ని వివరించారు.

రాష్ట్రవ్యాపితంగా కమ్యూనిస్టుపార్టీ భూసంస్కరణలకై జరిపిన పోరాటాలవల్ల ప్రభుత్వంలో కదలిక ఏర్పడిందన్నారు.

కేరళ ప్రభుత్వ విజయాన్ని, శ్రీ అచ్యుతమీనన్ ఆదర్శనీయమైనప్రజాస్వామ్య విధానాలను వివరించారు.

కొట్టారక్కర, నీలంబూర్ ఎన్నికలలో ఐక్యసంఘటన విజయాలతో మార్క్సిస్టుల ఆరోపణలు, ప్రచారాలు ఎంత బూటకమో తేలిపోయిందన్నారు.

సభా ప్రారంభంలో జిల్లా ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ ఉప్పలేటి ప్రభాకరరావు ప్రసంగిస్తూ, మానవ జీవితంలో నూతనాధ్యాయాన్ని ప్రారంభించిన లెనిన్, త్యాగం, సేవా తత్పరత, నిస్వార్థం ఉత్తమ నాయకత్వ లక్షణాలు గల్గిన మహా మేధావి అని అన్నారు.

ఒంటెత్తు పోకడలవల్ల దుస్సాహసిక విధానాలవల్ల సమస్యలు పరిష్కారంగావని విశాలమైన ప్రజా ఉద్యమాన్ని, కార్మికవర్గంలో ఐక్యతను నెలకొల్పాలని ప్రబోధించారని తెలిపారు.

తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ కె. ఎస్. ఆర్. ఆంజనేయులు, జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ చండ్ర రామలింగయ్య, తాలూకా వ్యవసాయసంఘ కార్యదర్శి శ్రీ సులేమాన్, గన్నవరం కమ్యూనిస్టు నాయకులు శ్రీ కొట్టగడ్డ పెద వెంకటరాయుడులుసహా వేదికనలంకరించారు.

తాలూకా కమ్యూనిస్టుసమితి కార్యాలయప్రారంభోత్సవం

గన్నవరంలో బస్‌స్టాండ్ సమీపంలో గన్నవరం తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యాలయానికి, జిల్లా కమ్యూనిస్టు నాయకులు శ్రీ చండ్ర రామలింగయ్య నేడు ప్రారంభోత్సవం గావించారు.

రాత్రి బహిరంగసభకు అధ్యక్షత వహించిన శ్రీ గొంది వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ పేద ప్రజలు ముందుకొచ్చి తమ తమ సమస్యల పరిష్కారానికి కమ్యూనిస్టుపార్టీ తోడ్పాటును పొందాల్సిందిగా విజ్ఞప్తిచేశారు.

అందుకు గన్నవరం తాలూకా కమ్యూనిస్టు సమితి కృషి గావిస్తుందని, లెనిన్ శత జయంతి సంవత్సరంగా ప్రతిజ్ఞ గైకొంటున్నామని ఆయన తెలిపారు.

'ప్రజాసభ విశ్వాస తీర్మానం'

మహమ్మద్ కోయా వ్యాఖ్య

తిరువనంతపురం, ఏప్రిల్ 21

కొట్టారక్కర, నిలంబూర్ ఉప ఎన్నికల ఫలితాలపై కేరళ హోం మంత్రి శ్రీ మహమ్మద్ కోయా వ్యాఖ్యానిస్తూ ఇది "ప్రజా సభ"లో ఆమోదించబడిన 'విశ్వాస తీర్మానం' అని అభివర్ణించారు.

(మాజీ మంత్రి కుంజాపై అవినీతి ఆరోపణల దర్యాప్తుకు జారీచేసిన ఉత్తర్వును కొట్టివేస్తూ జనవరి 20 వ తేదీన ఇచ్చిన తీర్పుపై నంబూద్రిపాద్ వ్యాఖ్యానిస్తూ 'ప్రజా న్యాయస్థానం' తీర్పు తీసుకుంటామన్న విషయం పాఠకులకు విదితమే).

తుదకును "చిన్నతరహాకురుక్షేత్రం కూడా ముగిసింది." అని కూడా శ్రీ కోయా వ్యాఖ్యానించారు.

(మార్క్సిస్టు మంత్రులపై అవినీతి ఆరోపణలపై దర్యాప్తు జరపాలన్న తీర్మానంపై చర్చ సందర్భంగా శ్రీ టి. వి. థామస్ ప్రసంగాన్ని ఉటంకిస్తూ 'కురుక్షేత్ర రంగం (ఎన్నికలు) లోనికి దిగవలసింది'గా శ్రీ నంబూద్రిపాద్ పదే పదే ప్రకటనలు చేశారు.)

మార్క్సిస్టులు, చెప్పింది, చేసింది అంతా తప్పేనని ఈ ఉపఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని శ్రీ కోయా చెప్పారు.

ముస్లింలీగ్ పలుకుబడి తుడిచి పెట్టుకుపోయిందని శ్రీ నంబూద్రిపాద్ చేస్తున్న ప్రకటనలు ఇకముందు చేయబోరని తాను ఆశిస్తున్నానన్నాడు.

కేరళ చైతన్యంపొందింది. ప్రజలను ఎంతోకాలం తెలివి తక్కువవాళ్ళను చేయలేరు" అని తాను మార్క్సిస్టులకు చెప్పదలిచానని శ్రీ కోయా చెప్పారు.

వడ్డీ లేకుండా భారత్‌కు రు 11.8 కోట్ల కెనడా అప్పు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

వడ్డీలేకుండా రు. 11 8 కోట్ల అప్పును కెనడా మన దేశానికి యిచ్చేందుకు అంగీకరించింది.

దీనికి సంబంధించిన ఒప్పందంపై నేడు యిక్కడ సంతకాలు జరిగాయి.

ఈ అప్పును 50 సంవత్సరాల్లో తీర్చవలసివుంటుంది. కెనడా యిచ్చే అప్పు క్రింద మన దేశం సీసం, తుత్తునాగం, నికిల్,ఆస్బెస్టాస్, న్యూస్ ప్రింట్, కృత్రిమ రబ్బరు దిగుమతి చేసుకుంటుంది.

ఈ ఒప్పందంపై భారత్ తరుపున ఆర్థిక మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ ఐ. జి. పటేల్, కెనడా హైకమిషనర్ జేమ్స్ జార్జి సంతకం చేశారు.

భారత్‌కు 1957 నుండి ఈ విధమైన సహాయం కెనడా చేయుటం, యిది అయినపాటి ఈ విధమైన అప్పు మొత్తం రు. 43 2 కోట్లకు పెరిగింది.

పాక్ విమానాలచే భారత్ గగనసీమ అతిక్రమణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

పాకిస్తాన్ విమానాలు ఈ సంవత్సరం ఇంతవరకు 10 సార్లు భారత గగనతలాన్ని అతిక్రమించాయని రక్షణమంత్రి శ్రీ స్వరణ్‌సింగ్ నేడు లోక్‌సభకు తెలియచేశారు.

1968 లో 16 సార్లు, 1969 లో 11 సార్లు పాక్ విమానాలు భారత గగనతలాన్ని అతిక్రమించాయని తెలియ జేశారు.

సరిహద్దుల సమీపంలో గస్తీదారి చర్యలు జరిపే విమానాలను కనుగొనటం సాధ్యమేనని, భారత గగనతలాన్ని అతిక్రమించినప్పుడెల్లా తగిన చర్యలు తీసుకోవటం జరిగిందని అన్నారు.

ఈ విషయంపై నిరసన తెలియజేయుటం జరిగిందని, సరిహద్దులలో భారత భద్రతా దళాలు అప్రమత్తంగా వున్నాయని తెలియచేశారు. అవసరమైతే భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయుట జరుగుతుందని చెప్పారు.

సోవియట్‌కు భారత్ తేయాకు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

1970 లో సోవియట్ మన దేశంనుండి 28 000 టన్నుల తేయాకు కొంటుందని భావిస్తున్నామని విదేశాంగ వాణిజ్య శాఖ డిప్యూటీ మంత్రి శ్రీ రామ్‌సేవక్ నేడు లోక్‌సభలో శ్రీ వి కృష్ణన్‌కు సమాధానం చెప్పారు.

గత సంవత్సరం సోవియట్ మన దేశం నుండి 26,400 టన్నుల తేయాకును ఖరీదు చేసింది.

ప్రధాని వెల్లడి

(1 పేజీ తరువాయి)

ల్యాలనుకున్నదని ప్రధాని స్పష్టీకరించారు.

పింఛను స్థిరంగా చెల్లించు లేదా విదేశీమారకద్రవ్యం సమకూర్చాల లాంటి కొన్ని ప్రత్యేక సౌకర్యాలు యిప్పటి పరిస్థితులకు అనుగుణంగాలేవు. ప్రస్తుత పరిస్థితులలో అలాంటి వాటికి స్థానంలేదు అని ప్రధాని చెప్పారు.

ఒక గంటసేపు జరిగిన కార్యవర్గ సమావేశంలో నక్సలైట్ల సమస్యపైనచర్చలు ఎక్కువగా జరిగాయి. చర్చను శ్రీ ఓం మెహతా ప్రారంభించారు. నక్సలైట్ల కార్యకలాపాలను దాగా అణచివేయని పక్షంలో దేశంలో తీవ్రపరిస్థితి ఏర్పడుతుందని, అందువలన తక్షణమే చట్టం తీసుకొని రావాలని ఆయన అన్నారు.

శ్రీ మెహతా సూచనను శ్రీయుతులు ఆర్. డి. భండారి, యస్. హెచ్. లస్కర్, తులసీదాస్ దాసప్ప, మహదేవ ప్రసాద్‌లు బలపర్చారు, ఇటీవల పశ్చిమ బెంగాల్‌లోని దౌర్జన్యాలను వారు ప్రస్తావించారు.

కొత్తగా చట్టం అవసరంలేదని. ప్రస్తుత చట్టాల్క్రిందనే నక్సలైట్ల కార్యకలాపాలను ప్రభుత్వం అణచివేయవచ్చునని శ్రీ కార్తిక్ ఓరాన్ అన్నారు.

మొత్తం సమస్యను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ప్రధాని తెలియజేశారు.

ప్రాథమికంగా అది శాంతి, భద్రతల సమస్య అని భావించిన సభ్యుల అభిప్రాయాలతో శ్రీమతి ఇందిరాగాంధీ ఏకీభవించారు.

నక్సలైట్ల సమస్యను పరిపాలనా, రాజకీయ దృక్కోణాలనుంచి పరిశీలించాలని పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ బి. శంకరానంద్ కోరారు. ఈ కార్యకలాపాలన్నింటికీ పునాది సమాజంలోని అసంతృప్తి అని, నక్సలైట్ల కార్యకలాపాలను తగిన చర్యల ద్వారా ఎదుర్కోవాలని ఆయన చెప్పారు.

మందుల పరిశ్రమలో 3501 మంది కార్మికులు 45 రోజులుగా సమ్మె చేస్తున్నారని, ఆ విషయంలో పరిష్కారాన్ని సాధించాలని శ్రీ జి. వెంకటస్వామి కోరారు.

ఈ విషయాన్ని కార్మికమంత్రి శ్రీ డి. సంజీవయ్య పరిశీలిస్తున్నారని ప్రధాని తెలిపారు. త్వరితంగా ఆ సమస్య పరిష్కారం కావాలనే అభిప్రాయంతో ఆమె ఏకీభవించారు.

బాంబు ప్రేలుడు

(1వ పేజీ తరువాయి)

నిస్టుపార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) నేడు తన అనుచరులకు పిలుపిచ్చింది.

గత సంవత్సరం సెప్టెంబరు నుండి బెంగాల్‌లోని 15 జిల్లాలలో నీచాతి నీచమైన 60 మంది వర్గ శత్రువులను నిర్మూలించినట్లుగా పార్టీ ప్రకటించింది.

మార్క్సిస్టు - లెనినిస్టు పార్టీ ఏర్పాటు చేసి సంవత్సరం అయిన సందర్భంగా తమ పార్టీ పత్రిక "దేశవ్రతి"లో సంపాదకీయంలో పై పిలుపును యిచ్చారు.

సాయుధ పోరాటానికి భారతదేశంలో పరిస్థితి పరిపక్వం అయిందని సంపాదకీయంలో పేర్కొన్నారు. కమ్యూనిస్టుపార్టీ మార్క్సిస్టు పార్టీలు రెండు రివిజనిస్టులని పేర్కొంటూ, వర్గశత్రువులతో ఆ రెండుపార్టీలు సర్దుబాటు చేసుకున్నాయని అన్నారు.

మార్క్సు, లెనిన్, మావో - సేటుంగ్‌ల బోధనలను ఖచ్చితంగా అమలుపరిచే తమ పార్టీ ఒక్కటే విప్లవ పార్టీ అని, సంపాదకీయంలో పేర్కొన్నారు.

లెనిన్ శత జయంత్యుత్సవ సందర్భంగా మన పార్టీ మొదటి వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నది. ఈ సంవత్సర కాలంలో మనం అనేక విజయాలను సాధించాం. చైర్మన్ మావో సేటుంగ్ ఆశీస్సులను అందుకున్నందువలన మన పార్టీ తప్పకుండా విజయవంతం అవుతుంది.

నక్సల్‌బరి, శ్రీకాకుళంలను సృష్టించిన తరువాత మావోసేటుంగ్ ప్రియ శిష్యుడైన శ్రీ చారుమజుందార్, కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు, లెనినిస్టు)ని స్థాపించారని దేశవ్రతి పేర్కొన్నది

ఆగ్రహావేశాలతోవున్న భారతీయ ప్రజలకు తమ వేదికగా కొత్తపార్టీ లభించింది. కొత్త పార్టీ కార్యక్రమాలు అగ్నిజ్వాలలమాదిరిగా భారతదేశంలోని 10రాష్ట్రాలకు వ్యాపించాయి.

పార్టీ ఏర్పడిన ఒక్క సంవత్సర కాలంలోనే అధికార వర్గం విచ్ఛిన్నమౌతున్న సూచనలు స్పష్టంగా కనబడుతున్నవి.

పశ్చిమ బెంగాల్‌లో ఐక్యసంఘటన విచ్ఛిన్నమయి, రాష్ట్రపతిపాలన ఏర్పడింది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఒట్టి బూటకమని ప్రజలకు తెలిసిపోయింది

బంగ్లాకాంగ్రెసు ఆందోళన

కలకత్తా, ఏప్రిల్ 22

పశ్చిమ బెంగాల్‌లో యిటీవల పెరుగుతున్న హింసాయుత ఘటనలపై బంగ్లా-కాంగ్రెసు తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది.

రాష్ట్రంలో రాష్ట్రపతిపాలన విధించిన వారం రోజులలోనే రాజకీయ హింసాయుత ఘటనలు గణనీయంగా తగ్గిపోయాయని, అయితే ప్రస్తుతం హింసాయుత ఘటనలు పెరిగిపోతున్నాయని ఒక తీర్మానంలో బంగ్లా కాంగ్రెసు కార్యవర్గం పేర్కొన్నది.

గట్టిగా యీ హింసాయుత కార్యకలాపాలను ఆపుచేసి, ఎటువంటి జాప్యంలేకుండా మామూలు పరిస్థితులు నెలకొల్పకపోతే పరిస్థితి మరింత క్షీణిస్తుందని ఆ తీర్మానంలో తెలియజేశారు. యీరోజు జరిగిన బంగ్లా కాంగ్రెసు కార్యవర్గ సమావేశానికి పార్టీ అధ్యక్షుడు శ్రీ అజయ్ ముఖర్జీ అధ్యక్షత వహించారు.

నాగిరెడ్డి కేసు

(1 వ పేజీ తరువాయి)

కూలద్రోయటంద్వారా రాజకీయ అధికారాన్ని హస్తగతం చేసుకోవాలనేలక్ష్యంతోసాయుధ పోరాటాన్ని సాగించే కార్యక్రమాన్ని అమలు పరిచేందుకు శ్రీ నాగిరెడ్డి నాయకత్వాన గల ఉగ్రవాదులు కొన్ని నిర్ణయాలు చేశారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రవేశపెట్టిన పత్రంలో పేర్కొన్నారు.

ఉగ్రవాదులు తీసుకున్న నిర్ణయం మేరకు కృష్ణా జిల్లా తిరువూరు తాలూకా అల్లూరుగడ్డ గ్రామం నిమ్మతోటలో రాష్ట్రస్థాయిలో రహస్య సమావేశం 1968 ఏప్రిల్ రెండవ వారంలో జరిగింది. రాజకీయ ప్రచారం, ప్రజా సమీకరణ తదితర కార్యక్రమాలను పూర్తిచేసుకుని వచ్చే వర్షాకాలం నాటికి సాయుధ పోరాటానికి సన్నద్ధం కావాలని ఆ సమావేశంలో నిర్ణయించినట్లు ఆరోపించారు.

రాష్ట్ర సమన్వయ కమిటీ నిర్ణయాలను శ్రీ నాగిరెడ్డి పత్రికలకు విడుదలచేస్తూ 1948 తెలంగాణా సాయుధ పోరాటం వంటి ఉద్యమాన్ని తమ పార్టీ త్వరలో ప్రారంభిస్తుందని ప్రకటించారని పత్రంలో తెలియచేశారు.

అఖిలభారత సమన్వయ కమిటీలోను, శ్రీకాకుళంలోను వచ్చిన విభేదాలదృష్ట్యా శ్రీ నాగిరెడ్డి ఆయన అనుయాయులు మావో భావాల నమ్మకంతో సాయుధపోరాటాన్ని నిర్వహించేందుకు కొత్తపార్టీని ప్రారంభించాలని నిర్ణయించారు.

1969 లో ఉగ్రవాదులు కార్యక్రమాలు తమ కార్యక్రమాలను ఉధృతం చేసి 7 హత్యలను 42 దోపిడీలను, యింకా యితర చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారని ప్రాసిక్యూటరు పత్రంలో పేర్కొన్నారు.

కోర్టులో మావో నినాదాలు

మావో నినాదాలతో యీ రోజు కోర్టు ఆవరణ దద్దరిల్లిపోయింది. స్పెషల్ మేజిస్ట్రేట్ ముందు విచారణకొరకు వచ్చిన ఉగ్రవాదులు శ్రీ నాగిరెడ్డి నాయకత్వాన నినాదాలు యివ్వటం ప్రారంభించారు.

పోలీసు వ్యాన్‌నుండి దిగిన వెంటనే వారు ఈ క్రింది నినాదాలు చేశారు.

"విప్లవం వర్థిల్లాలి", "విప్లవ కమ్యూనిస్టుపార్టీ జిందాబాద్", "వెంగళరావు పోలీసురాజ్యం నశించాలి", "చైర్మన్ మావో జిందాబాద్".

కోర్టు భవనం వరండాలలో కూడా వారు నినాదాలు కొనసాగించారు.

నినాదాలు చేయటం ద్వారా యితర కోర్టులలో పనికి ఆటంకం కలిగించవద్దని స్పెషల్ మేజిస్ట్రేట్ వారికి విజ్ఞప్తి చేశారు.

న్యాయస్థానంతో లోక్‌సభఘర్షణపడదు

(1 వ పేజీ తరువాయి)

యిచ్చిందని శ్రీ ధిల్లాన్ అన్నారు. సభలో సభ్యులు చేసే ప్రసంగాలను కోర్టులలోని ఎటువంటి ప్రొసీడింగ్స్‌లోకి తీసుకోరాదని పేర్కొన్నారు. సమన్లు, లేక నోటీసులకు మధ్య తనకు పెద్ద తేడా కనపడలేదని శ్రీ ధిల్లాన్ అన్నారు. ఎందు వలనంటే నోటీసులో ఈ క్రింది విధంగా పేర్కొనటం జరిగింది. "కోర్టు ముందు మీరు హాజరు కాకపోతే, కేసుపై ప్రత్యర్థికి అనుకూలంగా తీర్పు చెప్పవలసి వస్తుంది"

కొంతమంది సభ్యులు సభలో చెప్పిన దానికి కోర్టు ప్రొసీడింగ్స్‌తో సంబంధం వున్నది అని ఆయన అన్నారు,

ప్రస్తుత కేసులో కోర్టు ప్రొసీడింగ్స్ సభ్యులు ఒక్కరికి వ్యతిరేకంగానేకాకుండా, మాజీ స్పీకర్ శ్రీ సంజీవరెడ్డికి వ్యతిరేకంగా కూడ వున్నాయని అన్నారు.

కోర్టు పంపినవి సమన్లు అయినా నోటీసు అయినా వాటిని నిరాకరించ వలసిందిగా గౌరవనీయులైన పార్లమెంటు సభ్యులకు విజ్ఞప్తి చేయుటం నా బాధ్యత అని స్పీకర్ అన్నారు.

సుప్రీంకోర్టు వర్తమానాలకు సభ్యులు లొంగిపోరాదని అంటూ, మనకున్న హక్కుల పరిమితులలో మనలనుమనం రక్షించుకునేందుకు మనకు ప్రతిహక్కువున్నది అని శ్రీ ధిల్లాన్ యిచ్చిన రూలింగుకు సభలోని పలు పక్షాలు హర్షం ప్రకటించారు.

సుప్రీంకోర్టులో తన కేసుపై వాదించుకునేందుకు అనుమతి యివ్వవలసిందిగా కాంగ్రెసుసభ్యులు శ్రీ సాల్వే సభనుకోరారు.

అప్పుడు స్పీకర్ శ్రీ ధిల్లాన్ మాట్లాడుతూ సభ్యుడు తన సొంత బాధ్యతలపై ఆ విధంగా చేయవచ్చునని, సభ్యునిపైనా సభహక్కుల తీర్మానం తీసుకుని రావచ్చునని పేర్కొన్నారు.

తరువాత ఈ సమస్యపై ప్రతిపక్ష కాంగ్రెసు సభ్యులు శ్రీ వెంకటసుబ్బయ్య శ్రీ హేమ బారువా (పి. యస్. పి.) శ్రీ బలరాజ్ మధోక్ (జనసంఘ్) శ్రీ మధులిమాయే తదితరులు ప్రసంగించారు.

కూలిపోయిన వైమానికదళ విమానం లభ్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

ఏప్రిల్ 18 నుండి కన్పించకుండా వున్న భారత వైమానిక దళ రవాణా విమానాన్ని తూర్పుసెక్టరులోని అడవులలో కనుగొన్నారు.

ఈ విమానంలో 11 మంది రక్షణోద్యోగులు, మరియు సిబ్బంది వున్నారు. వీరంతా విమాన ప్రమాదంలో మరణించి వుండవచ్చునని తెలుస్తున్నది.

అప్రతిహతంగా సాగుతున్న ప్రదేశ్ వ్యవసాయకార్మిక మహాసభసన్నాహాలు

ప్రతినిధులను పంపేందుకు, విరాళాలు వసూలుకు

వివిధప్రాంతాల్లో కార్యకర్తల నిర్విరామ కృషి

విజయవాడ, ఏప్రిల్ 22

ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభ ప్రతినిధులను పంపేందుకు, మహాసభనిధికి విరాళాలు వసూలు చేసేందుకు వివిధ ప్రాంతాలలో కార్యకర్తలు, నాయకులు నిర్విరామ కృషి చేస్తున్నారు. వివిధ ప్రాంతాలలో జనరల్ బాడీ సమావేశాలు, బహిరంగసభలు జరిపి తగిన సన్నాహాలు చేస్తున్నట్లు యింకా వార్తలొస్తున్నాయి.

మార్కాపురంలో యీ నెల 25, 26 తేదీలలో జరుగనున్న ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభకు కృష్ణాజిల్లాలోని వివిధ తాలూకాల నుండి సుమారు 200 మంది ప్రతినిధులు, ప్రేక్షకులు బయలుదేరుతున్నారు. అప్పుడే 3 టూరిస్టు బస్సులు ఏర్పాటు చేసుకున్నారు.

మహాసభను విజయవంతం చేయడానికి జిల్లాలోని అన్ని తాలూకా కమ్యూనిస్టు సమితుల సమావేశాలు జరుపుకుని నిర్దిష్ట కార్యక్రమం తీసుకున్నాయి.

జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘ సభ్యత్వం విరివిగా చేర్పిస్తున్నారు.

బంజరు పోరాటంలో అగ్రగామి పాత్ర వహించిన నూజివీడు తాలూకా నుండి మహిళా ప్రతినిధులుగూడా బయలు దేరుతున్నారు.

చల్లపల్లినుండి ఒక బస్సు, వీరంకిలాకు నుండి ఒక బస్సు, నూజివీడు నుండి ఒక బస్సు బయలు దేరుతాయి.

కూరగాయల విరాళం

కృష్ణా జిల్లా దివి తాలూకా నుండి బెండకాయలు, బీరకాయలు, దోసకాయలు ఒక్కొక్క బస్తాకు తక్కువ కాకుండాను, అరటిఆకులు, ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభకు విరాళంగా పంపాలని వ్యవసాయ కార్మిక సంఘం నిర్ణయించింది.

గుంటూరునుండి ఏప్రిల్ 24 న ఒక బస్సు

మార్కాపురంలో ఈనెల 25, 26 తేదీలలో జరుగనున్న ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభకు ఈనెల 24 వ తేదీన గుంటూరునుండి ఒక బస్సు బయలుదేరుతుంది.

యార్లగడ్డ నుండి 4 గురు ప్రతినిధులు

యార్లగడ్డ, ఏప్రిల్ 21

దివితాలూకా యార్లగడ్డ కమ్యూనిస్టు శాఖ సమావేశం శ్రీబొప్పా వెంకటకృష్ణయ్య అధ్యక్షతన యీనెల 14 న జరిగింది.

శ్రీ బొప్పా కోటేశ్వరరావు కార్యదర్శిగా కొర్లి వెంకటరామారావు సహాయ కార్యదర్శిగా 7 గురితో కమిటీ ఎన్నుకొనడమయినది

శ్రీ మాలెంపాటి బాలభాస్కరరావు రాజకీయ రిపోర్టు యిచ్చారు. తాలూకా సమితి కార్యవర్గ సభ్యులు శ్రీయుతులు వెంటపాటి ప్రకాష్, మల్లపెద్ది రామసుబ్బయ్య, సమితి సభ్యులు హనుమల వెంకటేశ్వరరావు ఈ శాఖసమావేశానికి హాజరైనారు.

రాష్ట్రవ్యవసాయ కార్మిక మహాసభకు 4 గురు ప్రతినిధులను పంపుటకు నిర్ణయించడమైనది.

జిల్లా రాజకీయ పాఠశాలకు ఇబ్రహీంపట్నానికి 4 గురు విద్యార్థులను పంపుటకు నిర్ణయించడమైనది

తురిమెళ్ళనుండి కాలినడకన 50 మంది

ప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభ సన్నాహాల సందర్భంగా తురిమెళ్ళలో ఈనెల 11 న బహిరంగసభ జరిగింది. శ్రీ బెల్లంకొండ వెంకటరంగయ్య అధ్యక్షత వహించారు.

శ్రీ తుపాకుల బసవయ్య మహాసభ ప్రాముఖ్యతను వివరిస్తూ, కనీసం యిక్కడ నుండి 50 మంది కాలినడకన మార్కాపురం వెళ్ళాలని విజ్ఞప్తి చేశారు.

ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ నీలం రాజశేఖరరెడ్డి నేటి దేశ రాజకీయ పరిస్థితిపై మాట్లాడారు.

తర్వాత ఒంగోలుజిల్లా వైజ్ఞానికదళం వారిచే సీతారామరాజు బుర్రకథ చెప్పబడింది.

గిద్దలూరు తాలూకాలో రు. 1846 లు వసూలు

మేడిపిలో రు. 1000, మార్కాపురంలో రు. 1000 లు వాగ్దానాలు

గిద్దలూరు, ఏప్రిల్ 21

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక మహాసభ నిధికిగాను గిద్దలూరు తాలూకా వివిధ గ్రామాల్లో మొత్తం రు. 1846 లు వసూలయ్యింది.

గిద్దలూరు తాలూకా కందులాపురంలో రు. 423 లు, కంభంలో రు. 493 లు, క్రిష్ణంశెట్టి పల్లెలో రు. 280 లు, నరవలో రు. 135 లు, గిద్దలూరులో రు. 398 లు వసూలయ్యింది.

మేడపిలో రు. 1000 వాగ్దానం

మార్కాపురం తాలూకా మేడపిలో ఈ నెల 13 న జనరల్‌బాడీ సమావేశం జరిగింది. అన్నసముద్రంలో రాత్రి బహిరంగ సభ జరిగింది.

జనరల్‌బాడీ సమావేశానికి ముందుగా 3 రోజులు 10 గ్రామాల్లో శ్రీయుతులు ఆర్. చెంచయ్య, పిట్టమురుదు సుబ్బారావు గ్రూపు సమావేశాలు జరిపి, మైక్‌ద్వారా ప్రచారం చేశారు.

రెండు సభలకు శ్రీయుతులు నీలం రాజశేఖరరెడ్డి, గుజ్జుల ఎల్లమందారెడ్డి, పూల సుబ్బయ్య హాజరయ్యారు.

జనరల్‌బాడీ సమావేశంలో నాయకులు చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకొని మేడిపిలో వెయ్యి రూపాయల విరాళాలు వాగ్దానంచేశారు.

మార్కాపురంలో రు. 1000 వాగ్దానం

మార్కాపురం పట్టణంలో ఈ నెల 15 వ తేదీన ఒక పూట శ్రీయుతులు గుజ్జుల ఎల్లమందారెడ్డి, ఆర్. చెంచయ్య, మర్రి సుబ్బారాయుడు పలకల కంపెనీ కార్మికులను, వర్తకులను కలుసుకొని విరాళాలకై విజ్ఞప్తి చేయగా దాదాపు వెయ్యి రూపాయలకు వాగ్దానాలొచ్చాయి. రు 202 లు వసూలైనది.

కమ్యూనిస్టు పార్టీకి పెండ్లి కానుకలు

బందరు తాలూకాలో

బందరు, ఏప్రిల్ 21

కృష్ణాజిల్లా బందరు తాలూకా కప్పలదొడ్డి గ్రామస్థులు శ్రీ పేరిశెట్టి ఉమా మహేశ్వరరావు తమ కుమారుడు చి॥ సుదర్శనరావు పెండ్లి సందర్భంగా బందరు తాలూకా కమ్యూనిస్టుపార్టీకి రు 40 లు కానుకగా యిచ్చారు.

పెడన గ్రామస్థులు శ్రీ భట్టు కోటమల్లు తన కుమార్తె చి॥ దేవకన్య వివాహం సందర్భంగా తాలూకా కమ్యూనిస్టు సమితికి రు. 25 లు, కృష్ణాజిల్లా కమ్యూనిస్టు సమితికి రు. 25 లు, విశాలాంధ్ర దినపత్రికకు రు. 10 లు విరాళంగా యిచ్చారు.

పెడన గ్రామస్థులు శ్రీ జాగా బత్తుల నాగేశ్వరరావు తమ సోదరుడు చి॥ దాబూరావు వివాహం సందర్భంగా తాలూకా కమ్యూనిస్టుపార్టీకి రు. 10 లు కానుకగా యిచ్చారు.

జాతీయ లక్ష్యాలకు పొసగని సిలబస్

విద్యా పద్ధుపై లోక్‌సభ చర్చలో శ్రీ సర్జూ పాండే విమర్శ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20

పాఠ్య గ్రంథాల సిలబస్‌కు, జాతీయ లక్ష్యాలకు ఏ మాత్రం సంబంధం లేకుండా వున్నదని కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ సర్జూ పాండే లోక్‌సభలో నేడు విమర్శించారు.

విద్యాపద్ధుపై జరిగిన చర్చలో పాల్గొంటూ విద్యాశాఖలోవున్న పెక్కు లోపాలను శ్రీ పాండే తీవ్రంగా విమర్శించారు.

సోషలిజాన్ని, సెక్యులరిజాన్ని దేశలక్ష్యంగా తీసుకున్నప్పటికీ, మహారాజుల కీర్తిని గానం చేసే విధంగానూ, మతద్వేషాన్ని పెంచే విధంగాను పాఠ్య గ్రంథా లున్నాయన్నారు.

విద్యార్థుల డబ్బుతోనే కొన్ని విద్యా సంస్థలు నడపబడుతున్నా యన్నారు.

సామాన్య హిందీని ప్రచారం చేసే విషయంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైనదని ఆయన అన్నారు. [illegible] విషంటువును గూడ ప్రభుత్వం తేలేకపోయిందన్నారు. హిందీని గూర్చి పదేపదే ప్రశంసించేవారుగూడా యిందుకు బాధ్యులని ఆయన అన్నారు. హిందీయేతర భాషలు మాట్లాడే ప్రజలపట్ల వారికిగల శత్రువైఖరి మాత్రమే కల్పిస్తున్నదని ఆయన అన్నారు.

ఉర్దూకు సముచిత స్థానాన్ని యివ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉత్తర ప్రదేశ్ పాఠశాలలలో ఉర్దూను బోధించుటకు సరైన ఏర్పాట్లు లేక పోవటం సిగ్గు పడవలసిన విషయ మన్నారు.

హిందీని సులభతరం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చర్చను ప్రారంభించిన శ్రీ పి. ఆంథోని రెడ్డి మాట్లాడుతూ, విద్యాలయాలు రాజకీయ [illegible]

ఉక్కుఫ్యాక్టరీ స్థల నిర్ణయంపై ప్రధానికి అభినందనలు

తిరుపతి, ఏప్రిల్ 21

విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ స్థాపించేందుకు తన నిర్ణయాన్ని తెలియజేసినందుకు ప్రధాన మంత్రికి అభినందనలు తెలియజేస్తూ ఆనంద భరితులైన ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు టెలిగ్రాములు పంపుకున్నారు. ఇప్పటికి 4 టెలిగ్రాములు పంపబడినవి. (వి.వి.)

ఫారెస్టు బంజరు పంపిణీకై డిమాండ్

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 21

ప్రొద్దుటూరు తాలూకాలో పెన్నానది గట్టున చౌడూరు గ్రామంనుండి పెద్దశెట్టిపల్లె, దొరసానిపల్లె, రామేశ్వరం, మోడంపల్లె, నీలాపురం, రేగళ్ళపల్లె, కల్లూరు, తిప్పిరెడ్డిపల్లె గ్రామాలవరకు వందలాది ఎకరాల సారవంతమైన ఫారెస్టు బంజరు నిరుపయోగంగా పడివున్నది. వీటిలో చెట్లు, చేమా ఏమీ లేవు. ఫారెస్టు డిపార్టుమెంటుకు ఇవి పెద్దగా ఉపయోగపడదు. అందువల్ల దీనిని రిజర్వు ఫారెస్టునుంచి తొలగించి, పైగ్రామాల్లోనున్న వందలాది నిరుపేద వ్యవసాయకుటుంబాలకు పట్టాలకివ్వాలని ప్రొద్దుటూరు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ బి. సుబ్బారెడ్డి, అటవీశాఖ చీఫ్ కన్సర్వేటరుకు, డిప్యూటీ చీఫ్ కన్సర్వేటరుకు, జిల్లా ఫారెస్టు ఆఫీసరుకు, జిల్లా కలెక్టరుకు, జిల్లా రెవెన్యూ ఆఫీసరుకు మహజర్లు సమర్పించారు.

ఈ సమస్యపై ప్రభుత్వం, అధికారులు వెంటనే కదలి భూములులేని పేదవ్యవసాయ కార్మికులకు వెంటనే ఫారెస్టు బంజర్లను పట్టాలకిస్తూ ఉత్తర్వు చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. (వి. వి)



సికింద్రాబాద్ రైల్వే రిక్రియేషన్‌క్లబ్ గ్రౌండ్సులో రైల్వే వారోత్సవాలు జరిగిన సందర్భంలో సిబ్బందికి అవార్డులు, విజేతలకు బహుమతులిస్తున్న రాష్ట్ర గవర్నర్ శ్రీ కందూభాయ్ దేశాయ్

బంకులు పెట్టుకొన్న పేదలపై భరించరాని ఫీజులు

ప్రొద్దుటూరు మున్సిపల్ ఏరియాలో

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 22

ప్రొద్దుటూరు మున్సిపల్ ఏరియాలో బంకులు పెట్టుకొని క్షౌరంచేస్తూనో, టీ, సోడా, సిగరెట్, బీడీలు అమ్ముకొంటూనో జీవిస్తున్న పేదలపై మున్సిపాల్టీవారు భరింపరాని ఆక్రమణఫీజు విధిస్తున్నారు.

ఈ నిరుపేదలు తమకు బంకులవల్ల వచ్చే తక్కువ ఆదాయంతోనే తమ కుటుంబాలను పోషించుకొంటున్నారు.

మైదుకూరురోడ్డు, శివాలయం రోడ్డు, టి బి. రోడ్డుకోవున్న బంకులపై 20 చదరపు అడుగులుగాని, అంతకు తక్కువకాని వైశాల్యంవున్న బంకులకు నెలకు రు. 6 లు చొప్పున, మిగిలిన ఏరియాలోవున్న బంకులకు నెలకు రు. 4 చొప్పున ఫీజు విధిస్తున్నారు.

ఏదైన ఒక బంకుకు మార్చి నెలలోనే వేసుకున్నా, మొత్తం సంవత్సరానికి ఫీజు చెల్లించాలనే మున్సిపల్ నిబంధన చాలా దారుణం. అందువల్ల పట్టణంలోని బంకుల వారు చాలా ఆందోళన చెందుతున్నారు.

ఈ విషయమై పట్టణ కమ్యూనిస్టుసమితి కార్యదర్శి శ్రీ బి. సుబ్బారెడ్డి, బంకు యజమానుల సంతకాలతో కూడిన ఒకమహజరును మున్సిపల్ కార్యదర్శికి సమర్పించారు.

ప్రస్తుతమున్న రు. 6 ల ఫీజును రు. 2 లకు, రు. 4 ల ఫీజును రు. 1 కి ఈ సంవత్సరం నుంచైనా తగ్గించాలని ఆ మహజరులో కోరారు. (వి. వి.)

రాష్ట్రంలో పంచాయతీ సర్పంచ్‌లపై రు. 20 లక్షల సర్‌ఛార్జి

పంచాయతీరాజ్ మంత్రి వెల్లడి

అంబాజీపేట, ఏప్రిల్ 16

రాష్ట్రంలోని 15 వేల పంచాయితీల్లో 500 పంచాయితీల సర్పంచ్‌లపై రు. 20 లక్షల సర్చార్జీలు విధింపబడ్డాయి. పంచాయితీల అధ్యక్షులలో అత్యధికభాగం చదువు రానివారు, తీరికలేనివారు అయిన కారణంగా పన్నులు వసూలు కానందున సర్చార్జీ విధించబడ్డాయి. అలాటివారికి సహాయంగా రు. 20 వేలు పైబడి ఆదాయంగల పంచాయితీలకు మాత్రమే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లను నియమించడం జరిగింది. అంతేకాని, పంచాయితీ అధ్యక్షులు తప్పులు చేశారని కాని, వారిని కించపర్చాలనే ఉద్దేశ్యంతో గాని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల నియామకాలు జరుగలేదని పంచాయతీరాజ్ మంత్రి శ్రీ తోట రామస్వామి ముక్కామల సభలో అన్నారు.

తూర్పు గోదావరి జిల్లా అమలాపురం సమితికి చెందిన ముక్కామల గ్రామంలో పంచాయతీ కార్యాలయ భవనానికి మంత్రి రామస్వామి ఈ నెల 14 న ప్రారంభోత్సవం చేశారు. పంచాయతీ సర్పంచ్ శ్రీ ఆకెళ్ళ సత్యనారాయణమూర్తి స్వాగతం చెప్పారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన బహిరంగ సభకు జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీ ఎస్. పి. బి. కె. సత్యనారాయణరావు అధ్యక్షత వహించారు.

సిండికేట్ కాంగ్రెస్‌నాయకుడు శ్రీ ఎమ్. వి. ఎస్. సుబ్బరాజు స్వర్గీయ కళా వెంకట్రావు చిత్రపటావిష్కరణ చేశారు.

ఇదే గ్రామంలో కుటుంబ నియంత్రణ ఉపకేంద్ర భవనానికి దేవాదాయ మంత్రి శ్రీ ఆర్. రామలింగరాజు ప్రారంభోత్సవం చేశారు. ఆ సందర్భంగా అమలాపురం సమితి అధ్యక్షుడు శ్రీ దొమ్మేటి సాహెబ్ నాయుడు అధ్యక్షతన బహిరంగసభ జరిగింది

ఈ రెండు కార్యక్రమాలకు ఆంధ్రప్రదేశ్ ఛీఫ్ ఇంజనీర్, జిల్లా పరిషత్ కార్యదర్శి, కోనసీమలోని ప్రముఖులు, శాసనసభ్యులు హాజరయ్యారు. (వి. వి.)

వీరేశలింగం వర్ధంతి

రాజమండ్రిలో

రాజమండ్రి, ఏప్రిల్ 21

యుగ పురుషుడు, నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు 122వ జన్మదినోత్సవం స్థానికవీరేశలింగం హైస్కూలులో ఈనెల 16 వ తేదీ సాయంత్రం శాసనసభ్యులు శ్రీ చెరుకువాడ వెంకటరత్నం అధ్యక్షతను జరిగింది.

స్కూలు ప్రధానోపాధ్యాయులు శ్రీ మారిసెట్టి నాగేశ్వరరావు స్వాగతం చెప్పి నివేదికను సమర్పించారు.

శ్రీయుతులు మహీధర జగన్మోహనరావు, హైస్కూలు కమిటీ కార్యదర్శి శ్రీ మేడూరి సత్యనారాయణ, టి సత్యనారాయణ కందుకూరి సాహసోపేతమైన సంస్కరణ పోరాటం, స్త్రీ జనోద్ధరణ, సాహిత్యసేవ, అవినీతి వ్యతిరేక పోరాటాన్ని వివరించి నివాళులర్పించారు.

శ్రీ మారిసెట్టి నాగేశ్వరరావు కందుకూరిపై వచన గేయాన్ని చదివి వందన సమర్పణ చేశారు.

ఉదయం హైస్కూలు విద్యార్థులు, ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులూ వూరేగింపు జరిపి వీరేశలింగం విగ్రహానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. (వి. వి.)



భారతీయ సరుకుల నాణ్యత

ఉపరాష్ట్రపతి హెచ్చరిక

సోనేపట్, ఏప్రిల్ 21

ప్రపంచ మార్కెటు పోటీల్లో ప్రజాదరణ పొందేందుకు వీలుగా, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మనదేశంలో సరుకులను ఉత్పత్తిచేయవలసిన తక్షణ అవశ్యకత కలదని, భారత ఉప రాష్ట్రపతి శ్రీ జి. యస్. పఠక్ ఉగ్గడించారు.

సోనేపట్‌లోని అట్లాసు సైకిల్ ఇండస్ట్రీ లిమిటెడ్, సోనేపట్ పౌరులు యిటీవల ఉప రాష్ట్రపతికి యిచ్చిన సన్మానం సందర్భంగా ఆయన పైవిధంగా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన అట్లాస్ ఫాక్టరీని సందర్శించారు.

మన ఫ్యాక్టరీలు సమర్థవంతంగాను, నైపుణ్యతలోను సరుకులను ఉత్పత్తిచేయడం పైనే మనదేశ ప్రతిష్ఠకూడా ఆధారపడ వుందని ఆయన అన్నారు.

ఇది కేవలం వ్యక్తిగత సమస్య కాదనీ, యిది యావత్తు జాతికి సంబంధించిన అంశమనీ అన్నారు. పది పన్నెండు సంవత్సరాల క్రితం, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణమైన సరుకులను విదేశాలకు మన పారిశ్రామికవేత్తలు సరఫరా చేయడం లేదనే ఫిర్యాదును తాను వింటూండేవాడిననీ. ప్రస్తుతం అనేక ఫ్యాక్టరీలు వివిధ సరుకులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తయారుచేయటం, ఆయాకంపెనీలు విదేశీమార్కెటు పోటీలో ప్రశంసా పాత్రమైన స్థానాన్ని పొందటం తనకుసంతోషదాయకంగా వుందని పఠక్ చెప్పారు.

తిరుపతి పట్టణ హొటల్ కార్మికుల సర్వసభ్య సమావేశం

తిరుపతి, ఏప్రిల్ 21

[illegible] సర్వసభ్య సమావేశం శ్రీ పి. నాగులు అధ్యక్షతన యీ నెల 17 న జరిగింది

హోటల్ యజమానుల వలన తమకు జరుగుతున్న అన్యాయాలను వ్యక్తం చేస్తూ కరపత్రం వేయుటకు తీర్మానించారు. నూతన కార్యవర్గానికి అధ్యక్షులు శ్రీ పి. నాగులు, కార్యదర్శి శ్రీ కె. యస్. మహాదేవ అయ్యర్, కోశాధికారి శ్రీ కె. గోపాల్‌ను ఎన్నుకొన్నారు.

బొగ్గు వేతనసంఘం సిఫార్సుల అమలు

గని కార్మిక సమాఖ్య డిమాండ్

జబల్‌పూర్, ఏప్రిల్ 19

బొగ్గు వేతనసంఘం సిఫారసులను సంపూర్ణంగా సత్వరమే అమలుపరచాలని భారత జాతీయ గని కార్మికుల సమాఖ్య డిమాండ్ చేసింది. కోర్కెల సాధనకు నిర్విరామ పోరాటాన్ని కొనసాగించవలసిందిగా కార్మికులకు విజ్ఞప్తి చేసింది.

సమాఖ్య 15వ వార్షిక మహాసభ ప్రతినిధుల సమావేశం పై మేరకు ఒక తీర్మానాన్ని ఆమోదించింది. మూడు సంవత్సరాలు గడచినప్పటికీ, బొగ్గు వేతన సంఘం ఏకగ్రీవంగా చేసిన సిఫారసులను మొత్తంగా ప్రభుత్వం ఆమోదించలేదు. ఆ కొన్ని సిఫారసులనుకూడా వెంటనే ఆమోదించాలని తీర్మానంలో ప్రభుత్వాన్ని కోరారు.

గ్రాట్యుటీకి సంబంధించిన, బోనసు చెల్లింపుకు గల పోజు నిబంధనలను తొలగించటానికి సంబంధించిన నిర్ణయాలను అనుసరించటంలో జరుగుతున్న జాప్యం వల్ల తీర్మానంలో నిరసన తెలియచేశారు. ఈ నిర్ణయాలను యజమానులు అమలుపరచక పోవటాన్ని తీవ్రంగా ఖండించారు.

వేతనసంఘం సిఫారసులను, బోనస్ చట్టంలోని నిబంధనలను గని యజమానులు అమలుపరచటంలేదని సమాఖ్య ప్రధాన కార్యదర్శి శ్రీ కాంత్ మెహతా 1969 వార్షిక నివేదికలో తెలియచేశారు.

సమాఖ్య అధ్యక్షుడు శ్రీ మైఖేల్ జాన్ అధ్యక్షోపన్యాసమిస్తూ, జాతీయ లేబర్ కమిషన్ సిఫారసులను ప్రభుత్వం ఆమోదించగలదన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.

కమిషన్ సిఫారసు చేసిన విధంగా గని కార్మికుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

రాజమండ్రి, ఏప్రిల్ 21

ఈనెల 12, 13 తేదీలలో ఎక్సైజు సి. ఐ. శ్రీ జి యస్. ప్రకాశరావు అసిస్టెంట్ ఎస్. ఐలు శ్రీ ఎస్. కేశవులు, శ్రీ టి. యస్. మూర్తి రాజమండ్రి పట్టణంలో సిబ్బందితో పలు ప్రాంతాలలో దాడి చేసి, సారా కలిగివున్నందుకు, రవాణా చేస్తున్నందుకు 17 మందిని అరెస్టుచేసి, 48 గాలన్ల దొంగసారా, 158 గాలన్ల ఊటను 2 సైకిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. (వి. వి.)

ఉద్యోగ భద్రతలేని మోటారుకార్మికులు

లేబరు డిపార్టుమెంటు అశ్రద్ధకు శ్రీకాకుళం జిల్లా మోటారు కార్మికయూనియన్ నిరసన

సాలూరు, ఏప్రిల్ 22

శ్రీకాకుళం జిల్లాలో మోటారు కార్మికుల జీతాలు యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడివున్నాయి. కనీసం ఉద్యోగభద్రత కూడా లేదు. చట్టాలు అమలుజరపటంలో లేబరు డిపార్టుమెంటువారు అశ్రద్ధ వహిస్తున్నందున యీ స్థితికి కారణమైందని శ్రీకాకుళం జిల్లా మోటారు కార్మికుల ముఖ్య కార్యకర్తల సమావేశం తీవ్ర నిరసనను తెలియచేసింది.

ఈ సమావేశం ఈ నెల 15వ తేదీన శ్రీ సింధుశేఖర సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది.

కార్యవర్గం ఎన్నిక

జిల్లా యూనియన్ అధ్యక్షులుగా శ్రీ బి వి. రాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీ డి.వి రమణ, కార్యదర్శిగా శ్రీ కె. రాజు, మరో 11మంది కార్యవర్గ సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.

ఓవర్‌లోడ్ తనిఖీలవల్ల యజమానులే లాభపడుతున్నారు కనుక కార్మికులపై ఎలాంటి కేసు మోపకుండా యజమానులే అందుకు బాధ్యత వహించాలని ఈ సమావేశం కోరింది. మరికొన్ని తీర్మానాలు చేయబడ్డాయి.

అన్ని కేంద్రాలలో జనరల్‌బాడీ సమావేశాలు జరిప అవసరమైతే అధ్యక్ష, కార్యదర్శులకు ఒక రోజు సమ్మెకు పిలుపివ్వాలని ఈ సమావేశం విజ్ఞప్తి చేసింది.

మోటారు కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

శ్రీ కపర్ది నిశిత విమర్శ

పాలకొల్లు, ఏప్రిల్ 21

టాక్సీలు, లారీలు, ట్రాక్టర్లు నడుపుతున్న మోటారు కార్మికులు సుమారు 7½ లక్షల మంది వున్నారనీ, మరొక 3½ లక్షలమంది మోటారు పరిశ్రమకు సహాయకులుగా వున్నారనీ దేశంలో 11 లక్షలమంది కార్మికులు వున్న ఈ మోటారు పరిశ్రమ నిర్లక్ష్యం చేయబడుతున్నదని మోటారు రవాణా వర్కర్సు చట్టం కాని, మోటారు వెహికల్సు యాక్టుగాని సరిగా అమలుజరగక పోవటంవలన కార్మికులు యజమానుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడవలసిన దుస్థితి ఏర్పడిందని ప్రదేశ్ మోటారు వర్కర్సు ఫెడరేషన్ కార్యదర్శి శ్రీఎం.పి.ఎస్. కపర్ది నర్సాపురంతాలూకా మోటారు వర్కర్సు యూనియన్ ద్వితీయ వార్షిక సభను ప్రారంభిస్తూ ఉద్ఘాటించారు.

ఈనెల 14 వ తేదీన పాలకొల్లులో జరిగిన యీ వార్షికసభకు శ్రీ దేవరపు విష్ణుమూర్తి అధ్యక్షత వహించారు. తాలూకా నలుమూలలనుండి సుమారు 100 మంది కార్మికులు హాజరయ్యారు. శ్రీ మన్నె సూర్యచంద్రరావు కార్యదర్శి నివేదిక చదివారు. కపర్ది యింకా యిలా అన్నారు :

క్లీనర్లు, కండక్టర్లు, మెకానిక్కులు, డ్రైవర్లుగా పనిచేస్తున్న ఈ పరిశ్రమలోని వర్కర్సు పస్తులతోను, రోగాలతోను, అవిద్యతోను జీవిస్తున్నారు. రైల్వే వర్కర్లలో ఈ మోటారు వర్కర్లకు కార్మిక సంక్షేమ పథకాలు అమలు జరగటంలేదు.

మోటారు రవాణా వర్కర్సు యాక్టు అమలు జరగనివ్వకుండా యజమానులు కోర్టు నుండి స్టే ఆర్డరు తెచ్చారు.

నేషనల్ వేజ్‌బోర్డు 4 సంవత్సరాల క్రితం నియమించబడింది. దాని నిర్ణయాలు ఇటీవల ప్రకటించారు. అవి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా లేవు. కనీసం వాటిని కూడా ఒక్కొక్కచోట యజమానులు అమలు జరుపుటలేదు. మోటారువర్కర్సు ఐక్యంగా ఆందోళనచేసి తమ హక్కుల్ని సాధించుకోవాలి. బలమైన సంఘాల్ని నిర్మించుకోవాలి.

దేశంలో అనేక మార్పులు వస్తున్నాయి. మారుతున్న స్థితిగతుల కనుగుణంగా సమిష్టి ప్రయోజనం అనే భావంతో ఆందోళన చేయాలి. ప్రతిఒక్కరి పోరాటం అందరిపోరాటం అనేభావం పెంపొందించుకోవాలి. అని హర్షధ్వానాలమధ్య ఉపన్యాసం ముగించారు.

రాత్రికి పెద్ద బహిరంగసభ జరిగింది. మున్సిపల్ ఛైర్మన్ శ్రీ చోడిశెట్టి సూర్యారావు అధ్యక్షత వహించారు.

జాతీయోద్యమ నాయకులు శ్రీ అద్దేపల్లి సత్యనారాయణమూర్తి మున్సిపల్ వైస్ ఛైర్మన్ శ్రీ కరిమెరక రామనర్సింహులు, శ్రీ గుప్తా కపర్ది సభలో మాట్లాడారు.

నర్సాపురం తాలూకా మోటారు వర్కర్సు యూనియన్ తరుపున ఒక మెమోరాండం పాలకొల్లు ఛైర్మన్ శ్రీ చోడిశెట్టి సూర్యారావుకు యిస్తూ పాలకొల్లులో టాక్సీ, లారీ స్టాండ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు.

సభానంతరం ముమ్మిడివరం బాలికలచే "అల్లూరి సీతారామరాజు - బుర్రకథ చెప్పబడింది. (వి. వి.)

నల్గొండజిల్లా, [illegible] చెందిన డా॥ ఎం. పూర్ణచందర్‌రావు హైదరాబాద్‌లో ఎం. బి. బి. ఎస్ పాసై, 1961 లో ఇంగ్లండు వెళ్ళి, అక్కడ స్థిరపడి ప్రాక్టీసు చేస్తూ, ఈ నెల 5 వ తేదీన ఇంగ్లండులో ఆకస్మికంగా మరణించారు.

రేడియో

శుక్రవారం ఏప్రిల్ 24

శక 1892 ★ వైశాఖ 4

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉదయం : 6.00 వందేమాతరం, శుభోదయం, ప్రసార విశేషాలు; 6.10 భక్తిరంజని. దేవీస్తుతి: నాట-జ నటి; 6.40 ఆం. వా: 6.45 సూక్తిముక్తావళి: 6.50 పొలం పనులు; 7.00 తె. వా: 7.15 గాంధిమార్గము; 7.40 ఎన్. పి. అల్. పిఠల్‌రావు: 8.00 హిం. వా: 8.15 అం. వా; 8.30 హై. వలె; 9.30 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 11.45 చిత్ర తరంగిణి; 12.00 టి. సహెచ్. కృష్ణమాచార్యులు: వయొలిన్; 12.30 కార్మికుల కార్యక్రమం; 1.00 తరుణీమండలి; 1.30 ఆం. వా; 1.40 పసిడి పంటలు; 1.50 తె. వా; 2.00 వాతావరణ సూచన, 2 01 ఎన్. పి ఆర్. పిఠల్‌రావు: 2.30 ప్రసార సమాప్తి.

సాయంత్రం; 5.30 టి సి హెచ్. కృష్ణమాచార్యులు: వయొలిన్: 5.55 స్థానిక ప్రకటనలు; 6.00 ఆం వా: 6.05 ప్రాం. వా; 6.15 లలిత సంగీతం; 6.25 వ్యవసాయదారులకు వార్తా ప్రసారం; 6.30 చిత్రతరంగిణి: 7.00 తె. వా: 7.15 వంటసీమలు; 7.45 రసమంజరి హై. రిలే; 8.15 వాద్యబృందం; 8.45 హిం. వా: 9.00 ఆం. వా: 9.15 హై. వలె: 9.30 ఎస్. వి. వి. జగన్నాధదాస్యులు: 10.30 అం. వా; 10.35 జన గణ మన ప్రసార సమాప్తి.

హైదరాబాద్ (ఎ)

405.4 మీ. (740 కిలో సై.)
62.50 మీ (4800 కిలో సై)

ఉదయం : 6.25 వందేమాతరం: 6.30 భక్తిరంజని: 7.00 తె. వా: 7.15 గాంధి మార్గము: 7.40 స్వరవల్లరి: 7.45 స్తుతిమాల 7.55 సూక్తి ముక్తావళి: 8.00 హిం. వా: 8.15 అం. వా: 8.30 రామ్నాద్ కృష్ణన్: 9.00 వాతావరణసూచన, ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం : 12.20 హిందీ పాఠము: 12.30 కార్మికుల కార్యక్రమము: 1.00 తరుణీమండలి స్త్రీల కార్యక్రమం: 1.30 అం. వా: 1.40 చిత్రసీమ: 1.50 తె. వా: 2.00 వాతావరణసూచన, ప్రసార సమాప్తి

సాయంత్రం : 5.55 ప్రసార విశేషాలు 6.00 అం. వా: 6.05 ప్రాంతీయ వార్తలు: 6.15 ఉ. వా: (హైదరాబాద్ - కడపలు మాత్రమే) 6.25 వ్యవసాయదారులకు వార్తా ప్రసారం: 6.30 గ్రామస్థుల రేడియోగోష్ఠి: 7.00 తె. వా: 7.15 కుటుంబ నియంత్రణపై కార్యక్రమం: 7.30 చిత్రసీమ: 7.45 యువవాహిని; 8.15 రసతరంగం: 8.30 వాద్యసంగీతం: 8.45 హిం. వా: (కడప - విశాఖపట్నాలు మాత్రమే); 9.00 అం. వా: 9.15 సమైక్య భారతి; 9.30 వి. వలె; 10.30 అం. వా: 10.35 వాతావరణ సూచన - జనగణ మన ప్రసార సమాప్తి.

కడప

333.3 మీ. (900 కిలో సై.)
సా॥ 5.55 నుండి రాత్రి 10.35 వరకు
శనివారములు మాత్రము
సా॥ 5.55 నుండి 11.05 వరకు

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలో సై.)
సా॥ 5.55 నుండి రాత్రి 10.35 వరకు

తెలంగాణా ఎన్. జి. ఓల సంఘ [illegible] హోం 'ఉద్యోగి భవన్'కు హైదరాబాద్ [illegible] నరసింగరాజ్ శంకుస్థాపన [illegible]

విశాలాంధ్ర

1970 ఏప్రిల్ 23 గురువారం

క్రమబద్ధమైన పురోగతికి విజయం

కేరళలోని రెండు ఉప ఎన్నికలలోను ఐక్య సంఘటన అభ్యర్థులు గెలవడం, మార్క్సిస్టు అభ్యర్థి, ఆ పార్టీ బలపరచిన ఇండిపెండెంటు ఓడిపోవడం అక్కడి ప్రజానీకంలో వస్తున్న మార్పుకు చిహ్నం.

కొట్టార్కర ఉప ఎన్నికలో ముఖ్యమంత్రి అచ్యుతమీనన్ 26 వేల ఓట్ల మెజారిటీతో అఖండ విజయం సాధించారు. పోటీదారులలో అయిదుగురికి డిపాజిట్లు గల్లంతైనాయి. ఇందులో ఒకరు సిండికేటు అభ్యర్థి.

ఈ నియోజకవర్గంలో గతంలో కూడా కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి విజయం పొందినమాట నిజమే. కాని అచ్యుతమీనన్ సాధించిన అఖండ విజయానికి కారణాలు రెండు. గత ఆరు నెలలో ఐక్యసంఘటన ప్రభుత్వం సాధించిన ప్రజాహిత చర్యలు ఒక కారణం. మార్క్సిస్టులు, వారి అనుయాయులు కొందరు వైదొలగినా ఐక్యసంఘటన దృఢంగా కొనసాగటమే కాక ఈ సంఘటనవైపుగా కేరళ కాంగ్రెసువంటి మరికొన్ని పార్టీలు మొగ్గటం రెండో కారణం.

నీలంబూర్‌లో ఐక్యసంఘటన విజయం, మార్క్సిస్టుపార్టీకి ఘోరపరాజయం ఏమంటే ఈ నియోజకవర్గం ఆ పార్టీకి బలమైన కేంద్రంగా ఎంచబడుతున్నది. 1965 - 67 సంవత్సరాలలో ఆ పార్టీ అభ్యర్థి ఆ నియోజకవర్గంలో గెలిచారు గనుక.

ఐక్యసంఘటన ఆమోదించిన కార్యక్రమాన్ని జయప్రదంగా అచ్యుతమీనన్ ప్రభుత్వం అమలుజరుపుతుండగా, అందుకు అడుగడుగునా అడ్డుతగులుతూ అనవసర ఆందోళనలతో ఆటంకాలు కల్పిస్తున్న మార్క్సిస్టుపార్టీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలిచ్చిన తీర్పు ఇది.

గత ఆరు నెలలుగా కేరళ రాజకీయాలలో హర్షనీయమైన మార్పు వచ్చింది. భూసంస్కరణల బిల్లును, తదితర ప్రజాహిత చర్యలను ప్రభుత్వం దృఢచిత్తంతో, సూత్రబద్ధంగా, అమలు జరుపుతున్నది.

ప్రభుత్వ యంత్రాంగాన్ని, చట్టాలను, పార్టీ స్వప్రయోజనాలకై వాడుకునే మార్క్సిస్టుపార్టీ దుష్ట విధానానికి స్వస్తి చెప్పింది.

మార్క్సిస్టుపార్టీ ప్రారంభించిన అరాచక ఉద్యమాలన్నిటినీ దృఢహస్తంతో అణచివేసింది. ఎటిబెడద లేకుండా తన జీవితాన్ని కొనసాగించటానికి అవసరమైన శాంతి భద్రతలను సామాన్యపౌరునికి కలిగించింది.

మార్క్సిస్టుల దుష్పరిపాలనతో విసిగివేసారిన కేరళ ప్రజలు నిట్టూర్పు విడిచారు. క్రమబద్ధమైన పురోగతికి అంకితమైన ప్రభుత్వం ఎట్టకేలకు ఏర్పడినందుకు హర్షం వెలిబుచ్చారు. ఈ ఎన్నికలలో ఐక్య సంఘటన అభ్యర్థులను గెలిపించటం ద్వారా, తమ విజ్ఞతను ప్రదర్శించారు. రాజకీయ చైతన్యాన్ని నిరూపించుకున్నారు.

ఓటమి చెందిన మార్క్సిస్టుపార్టీ ఈ గుణపాఠాన్ని గ్రహించగలదా? అట్టి సూచనలేవీ కనపడటంలేదు. తాము నిర్మించదలచిన ప్రతిపక్ష డెమొక్రటిక్ యునైటెడ్ ఫ్రంటుకు అనుకూల ధోరణులు ఈ ఉపఎన్నికలలో నంబూద్రిపాదకు కనిపిస్తున్నాయట.

ఈ వ్యాఖ్యను ఏమనాలి? "పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టు"మన్నాడట ఇలాంటి ప్రబుద్ధుడే ఒకడు.

డ్యూటీలో మరణించిన డ్రైవరు కుటుంబానికి పరిహారం

ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు సమితి డిమాండ్

ఖమ్మం, ఏప్రిల్ 21

తిరువూరు డిపోకు చెందిన ఆర్.టి.సి. డ్రైవరు కృష్ణంరాజు మృతికి ఖమ్మం జిల్లా కమ్యూనిస్టు సమితి సంతాపం వ్యక్తం చేసింది. తన డ్యూటీ నిర్వహణలో, ప్రయాణీకుల అఘాయిత్యానికిగురై అసువులు కోల్పోయిన డ్రైవరు కుటుంబానికి వెంటనే నష్ట పరిహారం యివ్వవలసిందిగాను, హంతకులపై ప్రభుత్వం తీవ్ర చర్య తీసుకోవాలనీ డిమాండ్ చేసింది.

ప్రకటనలో యిలా తెలియజేసింది.

తిరువూరు డిపోకు చెందిన ఆర్. టి. సి. డ్రైవరు శ్రీ కృష్ణంరాజు డ్యూటీలో వుండగా యీ నెల 17వతేది సాయంత్రం మధిరనుంచి తిరువూరు వైపు బస్సు నడుపుతూ వుండగా మధిర సమీపంలోని జాలిపురం స్టేజివద్దకు రాగానే అప్పటున్న ప్రయాణీకులు బస్సులో ఖాళీలేక బస్సుపైన ఎక్కుతామని సిద్ధమయ్యేవరికి డ్రైవరు అంగీకరించనందున కొంత మంది దుండగులు ఆయనను విపరీతంగా కొట్టినఫలితంగా ప్రమాదస్థితిలో తిరువూరు ఆస్పత్రికి ఆయనను చేర్చేలోపుగా ప్రాణాలు కోల్పోయారు.

యీ దుర్ఘటన జరిగినతరువాత అన్నివైపులనుండి మధిర రూటులో బస్సులు ఆగిపోయాయి.

రోడ్డు రవాణా సంస్థ ప్రయాణీకులకు సరిపోయే బస్సులను ఏర్పాటుచేయకపోవటం వున్నబస్సులనుకూడానరైనస్థితిలోనడుపలేకపోవటంవల్ల ప్రతిరూట్‌లోనూ బస్సు నడిపే సిబ్బందిపైన దౌర్జన్యాలు జరుగటం పరిపాటైపోయింది. చివరకు హత్యలకు కూడా దారితీస్తోంది. ఇలాంటి పరిస్థితిలో తమవిధి నిర్వహణలో ఆర్. టి. సి. కార్మికులు వెనుకంజ వేస్తున్నారు.

పరిస్థితి ఇలాగే కొనసాగితే కార్పొరేషన్ మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం వుందనీ, హంతకులపైన తీవ్ర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

తన విధి నిర్వహణలో అసువులు బాసిన డ్రైవరు కుటుంబానికి తగిన నష్ట పరిహారం యివ్వాలని కూడా కార్పొరేషన్ను కోరుతున్నాము.

దుండగుల చేతిలో మరణించిన కృష్ణంరాజు డ్రైవరు కుటుంబానికి ఖమ్మంజిల్లా కమ్యూనిస్టుసమితిసంతాపాన్నిప్రకటించింది.

ముందు నుయ్యి - వెనుక గొయ్యి: నిక్సన్ ఎదుర్కొంటున్న సంకటం

1954 లో ఫ్రెంచిసామ్రాజ్యవాదులకు పట్టిన గతే, 1970 లో అమెరికాసామ్రాజ్యవాదులకు ఇండో-చైనాలో తప్పదని అక్కడి పరిణామాలు సూచించుతున్నాయి.

అమెరికా సామాన్య మానవుడు అతడే రాజకీయ పక్షంవాడయినా వియత్నాం యుద్ధంలో విసుగెత్తిపోయాడు. యిప్పటికి అధికారపక్షాల ప్రకారం వియత్నాంలో 40 వేల మంది అమెరికన్లు మరణించారు. రు. 75 వేల కోట్ల డబ్బు వియత్నాం యుద్ధంకోసం ఖర్చయింది.

వియత్నాం యుద్ధ విషఫలితాలు అమెరికా ఆర్థిక వ్యవస్థమీద పడటం చాలాకాలం క్రితమే ఆరంభం అయింది, యిప్పుడు ద్రవ్యోల్బణం అధికం కావటంతో సామాన్య ప్రజలు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. 5 సెంటుకి ఇదివరకు 4 దోసకాయలు దొరికితే యిప్పుడు ఒక్క దోసకాయ 35 సైసలు అయింది.

రాష్ట్రి ధరలు రెట్టుకురెట్టు పెరిగాయి. ఇటీవల పోస్టల్ ఛార్జీలు పెంచారు. దీనివల్ల సాధారణ ప్రజలు, చిన్నచిన్న వ్యాపారులు, ఉత్తరప్రత్యుత్తరాలకు పెట్టే ఖర్చు 150 శాతం పెరుగుతుంది. ఇదివరకు మామూలు పోస్టుకార్డుధర 4 సెంట్లు వుండేది. ఇప్పుడది ఆరుసెంట్లు అయింది. నిక్సన్ పార్లమెంటుకు పంపిన ప్రతిపాదనలు ఆమోదించితే కార్డు ధర 10 సెంట్లు అవుతుంది.

ఈ ధరల పెరుగుదలకి మూలకారణం వియత్నాం యుద్ధంలో అమెరికా తలదూర్చటమేననే భావం అమెరికా ప్రజల్లో సర్వత్రా బలపడింది. వియత్నాం నుంచి అమెరికా దళాలను పూర్తిగా ఉపసంహరించాలనే ఆందోళన తీవ్రం అవుతున్నది.

అంతటితో ఈ ఆందోళన ఆగటంలేదు. అసలు అమెరికా ప్రభుత్వ సైనిక వ్యయాన్నే తగ్గించాలని పక్షాలూ కోరుతున్నారు. యూరప్‌లోని అమెరికా దళాలను ఉపసంహరించాలనే వివాదం యిటీవల బలం పుంజుకుంటున్నది. అయితే వియత్నాం సమస్య ప్రధాన భూమిక వహిస్తున్నది.

బాన్ ప్రభుత్వం వ్యతిరేకత వెలిబుచ్చుతున్నప్పటికీ యూరప్‌లో 3 లక్షల 10 వేల సైన్యాన్ని నిరవధికంగా ఉంచవలెనని వాషింగ్టన్ ప్రభుత్వ ప్రతినిధులు అంటున్నారు. వచ్చే సంవత్సరం మధ్యవరకు జర్మనీలోని అమెరికా సైన్యాన్ని తగ్గించబోమని, ఆ తర్వాత సంగతి చెప్పలేమని నిక్సన్ అంటున్నారు.

యూరప్‌లోని అమెరికా సైన్యాల సంఖ్యను తగ్గించాలని సెనేటర్ మాన్స్‌ఫీల్డు తీర్మానాన్ని మెజారిటీ సెనేటర్లు ఆమోదించే సూచనలు కన్పిస్తున్నాయి. ఈ ధోరణిని గమనించి పాలకపక్షం వ్యవహరించకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని 'వాషింగ్టన్ పోస్ట్' యిటీవల హెచ్చరించింది. సెనేట్ వాదనలు నిక్సన్ వినకపోతే, సైనికశాఖ బడ్జెట్‌లో కోతపెడితే ఆశ్చర్యపోనక్కరలేదని యీ పత్రిక వ్రాసింది.

సెనేట్ - నిక్సన్‌ల మధ్య యుద్ధం

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియామకం విషయంలో నిక్సన్‌కు-సెనేట్‌కు మధ్య ఏర్పడిన అభిప్రాయభేదాలు చివరకు చిలికిచిలికి గాలివాన అయ్యాయి. దీని ప్రభావం వివాదాలకు సంబంధించిన అనేక అంశాలమీద వుంటుందనటంలో సందేహం లేదు.

సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిగా జి. హెరాల్డ్ కార్స్‌వెల్ నియామకాన్ని కూడా సెనేట్ ధిక్కరించటంతో దాదాపు నిక్సన్ తలకొట్టేసినట్లయింది. మొదట హేన్స్‌వర్త్ నియామకాన్ని సెనేట్ తిరస్కరించింది. ఆర్థికపరమైన అవినీతికి పాల్పడ్డాడని హేన్స్‌వర్త్ నియామకాన్ని సెనేట్ అంగీకరించలేదు. కార్స్‌వెల్ జాతివివక్షణావాది అని భావించి ఆయన నియామకానికి కూడా సెనేట్ అంగీకరించక పోవటం నిక్సన్‌కు కోపం కలిగించింది. ఈ సమస్యపై ఉత్తరాది దక్షిణాది రాష్ట్రాల వారిమధ్య వైషమ్యాలు రెచ్చగొట్టి, డెమొక్రటిక్ పార్టీకి బలమైన దక్షిణాది రాష్ట్రాలలో తన పలుకుబడి పెంచుకోవాలని నిక్సన్ ప్రయత్నిస్తున్నాడు కాని అవి ఎదురుతిరుగుతున్నాయి. న్యాయమూర్తులుగా సెనేట్ తిరస్కరించిన ఇద్దరూ దక్షిణాదివారే.

కోపం కొద్దీ సెనేట్‌పై నిక్సన్ విరుచుకుపడ్డరోజునే అమెరికా అధ్యక్షుని తోక కత్తిరించే తీర్మానాన్ని సెనేట్ విదేశ వ్యవహారాల కమిటీలో ఒక తీర్మానం ప్రతిపాదింపబడింది.

వియత్నాంలో అమెరికా సైనిక జోక్యానికి అవకాశం యిస్తూ, 1964 లో ఆమోదించిన 'టోంకింగ్ గల్ఫ్ తీర్మానాన్ని' రద్దుచేస్తూ ఈ తీర్మానం తేబడింది. పశ్చిమాసియా ప్రాంతంలోని అమెరికా అనుకూల దేశాలకు ఆయుధాలు యివ్వటానికి అవకాశం యిస్తూ, 1957 లో ఆమోదించిన తీర్మానాన్ని కూడా రద్దుచేస్తామనే తీర్మానం ప్రతిపాదనకు వచ్చింది.

అమెరికా ప్రజలకు నిక్సన్ ఎన్నికల సందర్భంగా యిచ్చిన హామీమీద నమ్మకం పోయింది. వచ్చే సంవత్సరం జూన్‌నాటికి వియత్నాంలోని అమెరికా సైన్యం 2,25 000 మంది వుంటుందని నిక్సన్ అంటున్నారు. లావోస్, కాంబోడియా పరిణామాలు చూసినాక ఆ మాటలను ఎవరూ విశ్వసించటంలేదు

కాంబోడియా సైనిక ప్రభుత్వానికి, లావోస్ రాచరిక ప్రభుత్వానికి యథోచితంగా సైనిక, ఆయుధ సహాయం యివ్వాలని నిక్సన్ సైనిక సలహాదార్లు చెబుతున్నారు.

ప్రజా బలం ప్రభుత్వాలకు ఎంత సాయంచేసినా ప్రయోజనం లేకపోగా, అమెరికా అపకీర్తి పాలవుతుందని సెనెట్‌లోని లిబరల్స్ విమర్శించుతున్నారు.

అమెరికా అధికార లెక్కల ప్రకారం లావోస్‌లో సైనిక సలహాదార్లు, సాంకేతిక నిపుణులు 1,000 మందికి పైగా వున్నారు. థాయిలాండ్ స్థావరాలలోని అమెరికా విమానాలు విముక్తి దళాలపై దాడులు కొనసాగిస్తున్నవి.

ఇలా వుండగా పాథెట్‌లావో విజయపరంపర చూచిన రాచరిక ప్రభుత్వ అధిపతి అమెరికా దాడుల్ని నిలిపివేసే విషయంలో అంగీకారానికి రావచ్చునని కొందరు భయపడుతున్నారు.

కాంబోడియా సైనిక ప్రభుత్వం ఎంతకాలం నిలుస్తుందో ఎవరూ ఊహించలేక పోతున్నారు. సైనిక ప్రభుత్వానికి కాంబోడియాలో యిప్పుడు లభిస్తున్న మద్దతు తాత్కాలికమేనని అమెరికా పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. కాంబోడియా రైతాంగంతో నూటికి 80 మంది సిహనౌక్‌నే తమ అధినేతగా భావిస్తున్నారు.

దేశంలో యుద్ధవిధానాలపట్ల తీవ్ర వ్యతిరేకత, ఇండో చైనాలో అననుకూల పరిస్థితులు చూస్తే, నిక్సన్‌కు ముందు నుయ్యి - వెనుక గొయ్యిగా తయారయింది.

సంప్రదింపులద్వారా ఇండో - చైనా సమస్య పరిష్కారం అయ్యే సూచనలు కన్పించటంలేదు. ఇండో - చైనా తటస్థీకరణను గ్యారంటీ చేయాలనే ఫ్రెంచి ప్రతిపాదన ఒకటి వున్నా, దానివల్ల ఏపక్షమూ ఆసక్తి చూపటంలేదు.

లేఖలు

మాచర్ల ఆర్.టి.సి. డిపో దుస్థితి

ఆర్యా!

మాచర్ల ఆర్. టి. సి. డిపో నాగార్జున సాగర్‌కు 18 మైళ్ళలో వుంది. నాగార్జునసాగర్‌ను యాత్రాస్థలంగా గుర్తించి ప్రకటించినప్పటికీ వేల సంఖ్యలో ప్రయాణీకులు, యాత్రికులు సాగర్ సందర్శనకు వస్తున్నప్పటికీ, వారికి సౌకర్యాలు చూసే ఆర్.టి.సి. అధికారి యీ డిపోలో లేరు. హైదరాబాదు వెళ్ళే బస్సులను రాత్రిపూట నెల్లూరు చీరాల, ఒంగోలుకు తీసుకువెళ్ళి అక్కడ నుండి హైదరాబాదు తీసుకువెడుతున్నారు. మాచర్ల బస్‌స్టాండులో కాంటీన్ లేదు.

మాచర్ల డిపో అధికారి నర్సరావుపేటలో వుంటూ, వచ్చిన కొత్తబస్సులను నర్సరావుపేట ఆఫీసులో వుంచి నడుపుతున్నట్లు తెలుస్తోంది.

మాచర్ల ప్రాంతంలో పాతబస్సులను నడుపుతున్నారు. రెండు సంవత్సరాలుగా మాచర్ల డిపోకు కొత్త బస్సులు లేవు. బస్సులు చెడిపోయి, మార్గమధ్యంలో ప్రజలు యిక్కట్లకు గురౌతున్నారు. ఈ నెల 16 వ తేదీన ఒకరోజున మూడు బస్సులు చెడిపోయాయి. గుంటూరు, కారంపూడి రూట్‌లలో రోడ్డువంతెనలు నిర్మించాల్సిన ఆవశ్యకత ఎంతోవుంది. మాచర్లలో సమర్థవంతమైన అధికారిని నియమించాలి.

నాగార్జునసాగర్ నుండి తిరుపతి, శ్రీశైలం, గిద్దలూరు నుండి హైదరాబాదు, మాచర్ల నుండి నర్సారావుపేట మీదుగా చీరాల ఒంగోలు, నెల్లూరు, కడప, జిల్లాల వారు హైదరాబాదు వెళ్ళడానికి యిదే దగ్గరదారి. అందుచేత ఆయా రూట్లలో బస్సులు వేయాలి.

ఇట్లు,
తల్లా శ్రీరాములు,
మాచర్ల, గుంటూరుజిల్లా.

లెనిన్ శత జయంతి: ఆకాశవాణి వైఖరి

మహాశయా!

ఈ నెల 22 వ తేదీన లెనిన్ శత జయంత్యుత్సవాలను పురస్కరించుకొని ఆకాశవాణి కొన్ని ప్రసారాలను ఏర్పాటు చేసింది.

ఢిల్లీ కేంద్రం నుండి ఏర్పాటు చేసిన కార్యక్రమాలు దేశవ్యాప్తంగావున్న రేడియో స్టేషన్లు రిలే చేయకపోగా, తెలుగునాటవున్న విజయవాడ, హైదరాబాద్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఒకే ఒక కార్యక్రమాన్నైనా కడప, విశాఖపట్నం కేంద్రాలు రిలేచేయుటానికి వీలులేకుండా చేశారు.

విజయవాడ, హైదరాబాద్ కేంద్రాల నుండి సాయంత్రం (22 వ తేదీన) 8.15 గంటలకు "ఆధునిక ప్రపంచం లెనిన్ గోష్టి కార్యక్రమంవుంది. ఇలాంటి కార్యక్రమం కడప, విశాఖలకు లేకుండాచేయుటం విచారకరం.

ఇట్లు,
ఎస్. నాగిరెడ్డి, కార్యదర్శి,
కడపతాలూకా కమ్యూనిస్టు సమితి.

సభలు - సమావేశాలు

విశాఖజిల్లా కమ్యూనిస్టుసమితి విస్తృత సమావేశం ఈ నెల 24, 25 తేదీలలో విశాఖపట్నం ఇల్లూరి నరసూరాయన్న సత్రంలో జరుగుతుంది. సమావేశం 24 వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమగును.

* * *

విశాఖజిల్లా ట్రేడ్‌యూనియన్ ఫ్రెక్షన్ సమావేశం ఈనెల 26 వ తేదీ ఉదయం 9 గంటలకువిశాఖపట్నంలోని హార్బరు యూనియన్ ఆఫీసులో జరుగుతుంది.

నిద్రాణమైవున్న స్త్రీజాతిని మేల్కొలిపినలెనిన్

విజయవాడ మహిళల సభలో జోహార్లు

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, ఏప్రిల్ 21

సమాజంలో నిద్రాణమై వున్న స్త్రీ జాతికి మేల్కొలుపు పాడిన నవయుగ వైతాళికుడు లెనినకు జోహార్లు అర్పిస్తూ, నేటి సాయంత్రం లెనిన్ శతజయంత్యుత్సవాల సందర్భంలో పలువురు మహిళామణులు ప్రసంగించారు.

హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన బాలల - మహిళల ఉత్సవానికి పట్టణ ఇస్కస్ కార్యదర్శి శ్రీమతి కొల్లి కస్తూరి అధ్యక్షత వహించారు.

సభలో కుమారి జి. ప్రభావతి (చిల్డ్రన్స్ మాంటిసోరి, గుంటూరు) తన రష్యా పర్యటనానుభవాలను తెలియచేస్తూ బాల బాలికల విద్య, ఆరోగ్య విషయాల్లో రష్యాలో అత్యంత శ్రద్ధ కనపరుస్తున్నారని, చిరునవ్వులతో చిన్నారి పాపలు, వెంటుతనంతో మాతృత్వం పండిన తల్లులు ఆ దేశానికి జీవం పోస్తున్నారని, వారి సుఖమయ జీవితానికి లెనిన్ వేసిన సామాజికపునాదులే కారణమన్నారు.

స్థానిక అడ్వకేట్ శ్రీమతి జి. మనోహరం మాట్లాడుతూ లెనిన్ స్త్రీ జాతిని ఉత్తేజపరచి విప్లవానికి నడిపించడమే గాకుండా, ఆ తరువాత దేశ ఆర్థిక, రాజకీయ, సాంఘిక రంగాల్లో అత్యున్నత స్థానాన్ని స్త్రీలు పొందగలిగేటట్లు చేశారని జోహారు అర్పించారు,

స్థానిక మాంటిసోరి స్కూలు ప్రధానోపాధ్యాయిని శ్రీమతి వి. కోటేశ్వరమ్మ ప్రసంగించుతూ రష్యాలో మహిళాలోకం కోసరం, ఆయన సాధించిన దానిని, ప్రపంచంలోని ప్రగతిశీలురైన మహిళలందరికి ఆశలు పురిగొల్పేటట్లు చేసిందన్నారు.

సమాజంలోని ఆస్తిని, ఉత్పత్తిని కొద్దిమంది చేతుల్లో నుండి గుంజి సాధారణ ప్రజానీకానికి చెందజేసి, అందులో ముఖ్యంగా మహిళలను భాగస్వాములుగాజేసి, ప్రప్రథమ కార్మిక ప్రజారాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు లెనిన్ అన్నారు.

స్త్రీ జాతికి సమాన హక్కులను, విముక్తిని ప్రసాదించిన లెనిన్‌కు స్త్రీజాతి జోహార్లు అర్పించుకున్నదని అన్నారు.

శ్రీమతి హేమలతాలవణం ప్రసంగించుతూ తరతరాల నుండి స్త్రీని అందగత్తెని తెగపొగిడి తన జీవితాన్ని అర్థం ఉండే అర్థరహితంగా గడిపేటట్లుచేసి విశ్వసుందరి పోటీలు నిర్వహించుతూ వింతగా వినోదించే ఈ సమాజానికి లెనిన్, మహాత్మా గాంధీ లాంటి మహనీయుల సిద్ధాంతాల అర్థం ఏనాటికైనా బోధపడతాయా అని ప్రశ్నించారు.

దేశంలో సగం జనాభా అయిన మహిళలు వంటింట్లోనే బ్రతుకు వెళ్లమారుస్తూంటే ఆ దేశం అభివృద్ధిచెందదని లెనిన్ విశ్వసించాడు. అట్టి మహనీయుని మహిళా లోకం స్మరించాల్సి వుంది, అన్నారు.

సభలో మున్సిపల్ కౌన్సిలర్ శ్రీమతి పోతిన అచ్చాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సభకు ముందు సంవత్సరం లోపు గల బాలల పోటీ నిర్వహించబడింది. ఈ బాలలను డాక్టర్లు పరీక్షించి ఎన్నికజేశారు.

ప్రథమ బహుమతి ప్రేమసాగర్, ద్వితీయ బహుమతి సుబ్బారావు, తృతీయ బహుమతి విల్సన్‌కు లభించింది.

రాజమండ్రిలో లెనిన్ శతజయంతి సన్నాహాలు

రాజమండ్రి, ఏప్రిల్ 21

పట్టణ కమ్యూనిస్టు సమితి, పట్టణ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ల సంయుక్త సమావేశంలో లెనిన్ శతజయంతిని వైభవంగా జరపడానికి, మేడే భారీయెత్తున జరపడానికి నిర్ణయాలు తీసుకుని అందుకు తగిన ఏర్పాట్లుచేస్తున్నారు.

లెనిన్ శతజయంతి సందర్భంగా నిలువెత్తు చిత్రపటం రాయించి పట్టణంలో ఊరేగింపు జరుపుతారు. పట్టణంలోని కార్మిక సంఘాలన్నీ ఈ ఊరేగింపులో పాల్గొంటాయి. సాయంత్రం బహిరంగసభలో పలువురు ప్రముఖులు లెనిన్ జీవితచరిత్ర ప్రసంగాలు చేస్తారు.

లెనిన్ నిలువెత్తుల రంగుల చిత్రపటాన్ని జిల్లా లేబరు యూనియన్ రాయించి ఇవ్వ దానికి వాగ్దానం చేసింది.

జాతీయ బహుమతులుప్రదానం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

వివిధరంగాలలో ప్రముఖులైన 80 మంది రాష్ట్రపతి శ్రీ గిరి నుండి జాతీయ అవార్డులను నేడు స్వీకరించారు.

రాష్ట్రపతి భవన్‌లో జరిగిన యీ బహుమతి ప్రదానోత్సవంలో పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ బిరుదులను 80 మంది స్వీకరించారు. ఈ సంవత్సరం మొత్తం 104 మందికి యీ బహుమతులు లభించాయి. 24 మంది యీ బహుమతి ప్రదానోత్సవానికి హాజరుకాలేదు.

ప్రఖ్యాత శాస్త్రజ్ఞులు, విద్యావేత్తలు, పాత్రికేయులు, పరిపాలనాదక్షులు, రచయితలు, సంఘ సేవకులు, సినీ కళాకారులు, క్రికెటర్లు యీ బహుమతులను స్వీకరించారు.

పద్మవిభూషణ పొందిన శ్రీ ఎ. రామస్వామి మొదలియార్, జనరల్ పి. కుమారమంగళం, అనేక విమర్శలకు లోనైన కలకత్తా చిత్ర నిర్మాత శ్రీ ఆర్. కె. షు, కేలు హాజరుకాని వారిలో ముఖ్యులు.

పెక్కుమంది మంత్రులు, పార్లమెంటు సభ్యులతో సహా దాదాపు 600 మంది యీ ఉత్సవానికి హాజరయ్యారు.

సినిమా నటులు శ్రీ రాజేంద్రకుమార్ శ్రీ జెమినీ గణేశన్, క్రికెటర్లు శ్రీ బి. ఎస్. బేడీ, ప్రసన్నలు బహుమతులు స్వీకరించే సమయంలో సుదీర్ఘ హర్షధ్వానాలు చెలరేగాయి.

బహుమతులుస్వీకరించిన వారిలో 8 మంది మహిళలు వున్నారు.

గుజరాత్‌లో పార్టీ ఫిరాయింపులు

అహ్మదాబాద్, ఏప్రిల్ 20

తన ప్రభుత్వాన్ని కూల్చడానికి తనపార్టీ నుండి ఫిరాయింపును ప్రోత్సహించడానికి స్వతంత్రపార్టీ, కాంగ్రెసులు అవినీతి పద్ధతులు అనుసరిస్తున్నాయని గుజరాత్ ముఖ్యమంత్రి శ్రీ హితేంద్రదేశాయ్ నేడు ఆరోపించారు.



లెనిన్ శతజయంతి సందర్భంగా విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన కవితాగోష్ఠిలో తమ కవితను చదువుతున్న శ్రీ శ్రీ. శ్రీయుతులు ఎస్. వి. జోగారావు, తుమ్మల వెంకటరామయ్య, [illegible] సత్యనారాయణలు కూడా వేదికపై ఉన్నారు.

వంశధార ప్రాజెక్టు 'గొట్టా బ్యారేజి'కి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి శంకుస్థాపన చేసినప్పటి చిత్రం. ఈ చిత్రంలో యింకా నీటి పారుదల మంత్రి శ్రీ శీలం సిద్దారెడ్డి, విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి శ్రీ కృష్ణమూర్తి నాయుడు, ఛీఫ్ ఇంజనీర్ శ్రీ కె. శ్రీనివాసరావు వున్నారు

సమగ్ర పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవాలి

జనగామ తాలూకా వ్యవసాయ కార్మిక మహాసభ డిమాండ్: అత్యంతఉత్సాహ వాతావరణంలో ఐదువేలమందితోబహిరంగసభ

జనగామ, ఏప్రిల్ 20

తెలంగాణాలోని ఆరు జిల్లాలకు నీటి వసతి కలిగించి, యింతవరకు జరిగిన అన్యాయాన్ని తొలగించేందుకు వీలుగా ప్రభుత్వం సత్వరమే సమగ్ర పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోవాలని వరంగల్ జిల్లా జనగామ తాలూకా వ్యవసాయ కార్మిక 7 వ మహాసభ డిమాండ్ చేసింది.

ఈ మహాసభ ఈ నెల 15 వ తేదీన దబ్బన్నపేట గ్రామంలో జరిగింది. మహాసభ ప్రారంభానికి ముందుగా శ్రీ గోపాలరెడ్డి నగర్‌లో అమరవీరుల స్థూపంవద్ద జిల్లా వ్యవసాయ కార్మికసంఘ కార్యదర్శి శ్రీ యస్. వెంకటరామయ్య పతాకావిష్కరణ చేశారు.

ఈ మహాసభకు శ్రీయుతులు చల్లానర్సింహారెడ్డి, అరే సోమయ్య, కె. లక్ష్మినేతో అధ్యక్షవర్గాన్ని ఎన్నుకున్నారు.

శ్రీ ఎల్. వెంకటరామయ్య తన సందేశమిస్తూ, రాష్ట్ర వ్యాపితంగా జరిగిన భూఆక్రమణ ఉద్యమం సందర్భంగా తన అనుభవాలను వివరించారు.

మానుకోట తాలూకాలో బంజరు ఆక్రమణదార్లపై భూస్వామ్య శక్తుల ప్రోద్బలంతో పోలీసులు జరిపిన పైశాచిక చర్యలను ఖండించారు.

జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ కొండపల్లి గోపాలరావు నేటి దేశ రాజకీయపరిస్థితిని వివరిస్తూ కార్మికవర్గమంతా ఐక్యపోరాటాలద్వారా తమ హక్కులను సాధించుకోవాలని ఉద్బోధించారు.

తాలూకా వ్యవసాయ కార్మికసంఘ కార్యదర్శి శ్రీ డి. వి. గౌడ్ తాలూకాలోని కార్యకలాపాల నివేదికను సమర్పించారు.

రాష్ట్రంలో హరిజన, పేద వ్యవసాయ కార్మికులపై భూస్వామ్యవర్గాలు జరుపుతున్న హింసాయుత చర్యలపై పోలీసులు తగిన చర్యలు తీసుకోకుండా మెతకతనం ప్రదర్శిస్తున్నందుకు నిరసిస్తూ, హింసా చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సభ కోరింది.

కనీస వేతన చట్టం అమలుకై డిమాండ్

కనీస వేతన చట్టాన్ని నేటి జీవన న్యాయ కనుగుణంగా సవరించి, వెంటనే అమలు జరిపేందుకు పూనుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ మహాసభ తీర్మానం చేసింది.

వెయ్యిమందితో ప్రదర్శన: 5 వేల మందితో సభ

అదే రోజు వ్యార వెయ్యి మందితో ఊరేగింపు జరిగింది. అనంతరం జరిగిన బహిరంగ సభలో అత్యంతఉత్సాహంతో 5 వేలకు పైగా ప్రజలు పాల్గొన్నారు.

సభలో శ్రీ కె. గోపాలరావు మాట్లాడుతూ ముఖ్యంగా మహబూబాబాదు తాలూకాలో నక్సలైట్ల అణచివేత పేరుతో పోలీసులు గర్భిణీ స్త్రీలను సైతం అవమానించుటకోయి మానభంగం చేస్తున్నా అడిగేనాథుడు లేకపోయాడు.

ఇక ఈనాడు కాంగ్రెస్‌వాదులుకూడా సోషలిజం అంటున్నారు. కాని, నేటివరకు పాలించే అర్హతను అది కోల్పోయింది. దాని స్థానంలో జాతీయ ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలి. అందుకు అభివృద్ధికాముకశక్తులన్నీ కనీస కార్యక్రమంపై ఐక్యం కావాలన్నారు. కాని, దురదృష్టవశాత్తు మనంటే మార్క్సిస్టులు ప్రజా ఉద్యమ విచ్ఛిన్నకులుగా తయారయ్యారు. కావున వీరి అవకాశవాద విధానాలను కార్మికవర్గం ఎన్నడూ సహించదని శ్రీ గోపాలరావు హెచ్చరించారు.

తర్వాత శ్రీయుతులు ఎల్. వెంకటరామయ్య, కె. మల్లారెడ్డి, డి. వి. గౌడ్ మాట్లాడారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలివ్వబడ్డాయి.

ఉభయ జర్మనీల మధ్య

కామన్వెల్తు తరహా సంబంధాలు?

(విశాలాంధ్ర బెర్లిన్ విలేకరి)

బెర్లిన్, ఏప్రిల్ 19

ఉభయ జర్మనీల మధ్య కామన్వెల్తు నమూనాలో సంబంధాలు పెట్టుకోవచ్చుననీ, హైకమిషనర్లను మార్పిడి చేసుకోవాలని బాన్ విదేశాంగ మంత్రి షీల్, ఎర్‌ఫర్ట్ సమావేశం తరువాత ఒక పత్రికా సమావేశంలో సూచనప్రాయంగా అన్నాడు.

ఎర్‌ఫర్ట్ సమావేశం తరువాత బాన్ అధ్యక్షుడు బ్రాంట్ విధాన ప్రకటన ఏ విధంగా వుంటుందోనని రాజకీయ పరిశీలకులు ఆతురతతో వున్నారు.

షీల్ తమ ప్రతిపాదనను తూర్పు జర్మనీకి అధికారయుతంగా తెలియచేయలేదు. ఎందుకనగా కామన్వెల్తు నమూనాలో సంబంధాలు వుండాలని అధికారయుతంగా తెలియజేసిన పక్షంలో అందులో అగ్రదేశంగా ఏ జర్మనీ వుండాలనే చిక్కులు ఎదురౌతాయని ఆయన భావించి వుండవచ్చు.

మరో పత్రికా సమావేశంలో ఆయన చేసిన ప్రకటన కొద్ది తేడాతో కనిపిస్తుంది. ప్రస్తుతానికి రెండు జర్మనీల మధ్య అంతర్జాతీయ చట్టం ప్రాతిపదికకన్నా కొద్దిగా తక్కువ స్థాయిలో సంబంధాలు వుండాలని అన్నాడు.

తూర్పు జర్మనీతో సాధారణ సంబంధాలు ఏర్పరచుకోవాలని బాన్ ప్రజలు చేస్తున్న డిమాండ్‌ను ఈ ప్రకటనలు సంతృప్తి పరచలేవు. మాటలతోపాటు ఆచరణ రీత్యా చర్యలు తీసుకోవాలని బాన్ నిర్ణయించింది. ఇన్ని సంవత్సరాలనుంచి వాతావరణాన్ని తెలిపేందుకు 1937నాటి జర్మనీపటాన్నే వాడుతున్న బాన్ యిప్పుడు తన వైఖరి మార్చుకున్నది. ఇప్పుడు జర్మనీ దేశపటం స్థానంలో మొత్తం యూరప్ వాతావరణాన్ని తెలిపే చిత్రాన్ని టెలివిజన్‌లో బాన్ ప్రదర్శిస్తున్నది.

తూర్పుజర్మనీపట్లగల వివక్షతను బాన్ అంతమొందించుకునేందుకే ప్రయత్నిస్తున్నదని మూడు పాశ్చాత్యరాజ్యాలు నిరూపించటానికి ప్రయత్నించాయి.

బెర్లిన్‌లో నాలుగు అగ్రరాజ్యాలు సమావేశమౌతున్న సందర్భంలో పశ్చిమబెర్లిన్‌లో పాస్‌పోర్టులు యిచ్చే ఆఫీసును తాత్కాలికంగా సస్పెండ్ చేయాలని మూడు పశ్చిమ దేశాలు ప్రకటించాయి. యుద్ధం ముగిసిన 25 సంవత్సరాల తరువాత కూడా పశ్చిమ బెర్లిన్‌లో ఈ ఆఫీసు, తూర్పు జర్మనీలో నివసిస్తున్నవారికి పాస్‌పోర్టులు యిస్తూ బహిరంగంగా రెచ్చగొట్టే విధానాలకు పాల్పడుతూ వచ్చింది. ఎట్టకు దేశాలకు ఈ ప్రకటనలోగల చిత్తశుద్ధిని బ్రిటన్ వమ్ముచేసింది. తూర్పు జర్మని సరిగా ప్రవర్తించని పక్షంలో పాస్‌పోర్టులయిచ్చే ఆఫీసు పనిని తిరిగి ప్రారంభిస్తామని బ్రిటన్ విదేశాంగశాఖ హెచ్చరిక చేసింది.

జర్మనీలో జరిగే ఒలింపిక్ క్రీడల సందర్భంగా 1937 జర్మనీ పటంతో బాన్ ముద్రించిన నాణేనికు, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ అధ్యక్షుడు (అమెరికా జాతీయుడు) నిరసన తెలిపిన తరువాత ఉపసంహరించుకోవటం జరిగింది.

అమెరికా విదేశాంగ డిప్యూటీ మంత్రి ఇటీవల మాట్లాడుతూ ఐ.రా.స.లో రెండు జర్మనీలు ఒకేసారి చేరటాన్ని అమెరికా వ్యతిరేకించకపోవచ్చునని అన్నాడు. దీని అర్థం పారిస్ సంధిని నిరుపయోగపరచటంగానీ, అంతర్జాతీయ చట్టం ప్రకారం తూర్పుజర్మనీని బాన్ గుర్తించటంగాని కాదని ఆయన అన్నాడు.

ఏదిఏమైనప్పటికీ ఇటీవలే జరిగిన రెండు ఘటనలు సరియైనవికావని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అందులో ఒకటి. యూరప్ ఆర్థిక కమిషన్‌లో తూర్పుజర్మనీని చేర్చుకోవాలని పోలెండ్ చేసిన ప్రతిపాదనను బాన్ ప్రతినిధివర్గం వ్యతిరేకించింది. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనాల్సిందిగా యూరప్ ఆర్థిక కమిషన్ అధ్యక్షునికి. ఐ.రా.స. ప్రధాన కార్యదర్శి ఊథాంట్ ఒక లేఖను వ్రాసిన తరువాతనైనా బాన్ ఇటువంటి వ్యతిరేక చర్యలకు పాల్పడింది. ఓటింగుకు ముందుగా బాన్ కొన్ని సూచనలను చేసింది. ఓటింగ్ హక్కులేకుండా తూర్పు జర్మనీ సమావేశంలో కూర్చోవచ్చునని తెలిపింది. సభలో పాల్గొంటున్న దేశాల పేర్లతో తూర్పు జర్మనీ పేరు చేర్చరాదని తెలిపింది. అదే విధంగా సభలో అక్షరక్రమం వరుసలో కూడా కూర్చోరాదని పేర్కొన్నది.

ఉభయ జర్మనీలమధ్య సాధారణ సంబంధాలు ఏర్పడాలని ఆశించినవారి ఆశలను అడియాసలు గావించిన వార్త మరొకటి వుంది.

నయా నాజీపార్టీ బాకా అయిన "నేషనల్ జైటుంగ్" పత్రిక సంపాదకుడు తూర్పు జర్మనీ ప్రధాని విల్లి స్టోఫ్‌పై బాన్, కాసెల్ నగరాలలోని కోర్టులో దేశద్రోహ నేరం ఆరోపించారు. ఇది రెచ్చగొట్టేందుకు మాత్రమే పాల్పడ్డ చర్య అని స్పష్టంగా అనుకోవచ్చు. నయానాజీలు తలపెట్టిన ఈ చర్యలోని అంతరార్థం ఏమిటంటే తూర్పుజర్మనీ ప్రజలంతా బాన్ పౌరులేననీ వారిని బాన్‌లోని కోర్టుల ద్వారా శిక్షించవచ్చునని వారి భావన.

ఈ కేసును రద్దుచేయటంలో బాన్ అధ్యక్షుడు బ్రాంట్ కృతకృత్యులౌతారో లేదో చూడవలసి వుంది.

పాక్ కాందిశీకులకు పునరావాసం

ఆదిలాబాదుజిల్లాలో

హైదరాబాద్, ఏప్రిల్ 21

ఆదిలాబాద్‌జిల్లా ఇసాగాం గ్రామం సమీపంలోని 10 గ్రామాలలో తూర్పు పాకిస్తానునుండి వచ్చిన 960 కాందిశీక కుటుంబాలకు పునరావాసం కల్పించటం జరిగింది.

ప్రతిగ్రామంలో ప్రాథమిక పాఠశాలను నెలకొల్పారు. ఆస్పత్రులను నెలకొల్పటానికి ఆర్థిక సహాయం యివ్వడం జరిగిందని అధికార పూర్వకంగా నేడిక్కడ తెలియవచ్చింది.

946 కుటుంబాలకు చెందిన వారు వ్యవసాయదారులు, వీరికి 6700 ఎకరాల భూమిని సేకరించి యివ్వటం జరిగింది.

ఇదే సంఖ్యలోగల కొత్తగా వచ్చిన కాందిశీకులకు రామగుండం వద్ద పునరావాసం కల్పించడం జరుగుతుంది.

ఇక్కడ వేయి నివాస గృహాలను, నూలు మిల్లు భవనాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 150 కుటుంబాలను ఈ ప్రాంతానికి తరలించడం జరిగింది.

425 మంది కాందిశీకులకు ఉపాధిని కల్పించే నిమిత్తం నెల్లూరు, రాజమండ్రిలోని సహకార నూలు మిల్లులకు ఆర్థిక సహాయం యివ్వడం జరిగింది.

34 వేల కుటుంబాలకు వ్యవసాయంలోను, చిన్న చిన్న వ్యాపారం, లఘు పరిశ్రమలలో వివిధ రాష్ట్రాలలో పునరావాసం కల్పించడం జరిగింది. దాదాపు 5 వేల కుటుంబాలు త్రిపుర ప్రాంతంలో స్థిరపడిపోయాయి.

శాసనసభ వాయిదాపై హైకోర్టులో విచారణ

హాజరుకు స్పీకరు నిరాకరణ

అహ్మదాబాద్, ఏప్రిల్ 21

గుజరాత్ శాసనసభను నిరవధికంగా వాయిదా వేస్తూ స్పీకరు గైకొన్న చర్యపై వచ్చిన పిటీషన్‌పై గుజరాత్ హైకోర్టులో నేడు విచారణ ప్రారంభమయింది. అయితే స్పీకరు కోర్టుకు మాత్రం హాజరుకాలేదు.

స్పీకరు సభకు హాజరుకాకపోవటానికి కారణం తెలుపుతూ శాసనసభ కార్యదర్శి స్పీకరు ఆదేశంపై హైకోర్టుకు ఒక లేఖ వ్రాశారు.

హైకోర్టులో స్పీకరు హాజరవటం శాసనసభ ప్రయోజనాలను రక్షించుటలో తన విధులను సరిగా నెరవేర్చినట్లుగాదని ఆ లేఖలో పేర్కొనబడింది.

శాసనసభకు కొన్ని ప్రత్యేక హక్కులున్నవని, వాటిని పరిరక్షించవలసిన బాధ్యత స్పీకర్‌కు గలదని కోర్టువారు గుర్తిస్తారనే ఆశాభావం ఆ లేఖలో వ్యక్తం చేయబడింది, కావున చర్యలను తీసుకొనటం శాసనసభ హక్కులను అలక్ష్యం చేసినట్లు వుండగలదని పేర్కొనబడింది.

శాసనసభ తరఫున పిటీషన్‌కు ఎలాంటి సమాధానం యివ్వాలని స్పీకరు భావించలేదు.

దీనితో శాసనసభ తరఫున వాదించుటకు శ్రీ జి.టి. దాయను కోర్టు నియమించింది.

కోర్టుకు సహాయం చేయని విధంగా శాసనసభ యీ విధంగా ప్రవర్తించటం విచారకరమని ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. యన్. భగవతి అన్నారు.

30 లక్షల టన్నుల గోధుమ సేకరణ

రబీ పంటకాలంలో జరపాలని

భారత ఆహార కార్పొరేషన్ నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

ప్రస్తుత రబీ పంటకాలంలో భారత ఆహార కార్పొరేషన్ 30 లక్షల టన్నులకు పైగా గోధుమను సేకరించాలని నిర్ణయించింది.

ఈ పంటకాలం ఏప్రిల్ 20 నుండి ప్రారంభమౌతుంది.

ఇందులో పంజాబు వాటా 25 లక్షల టన్నులు వుంటుందని కార్పొరేషన్ చైర్మన్ శ్రీ షానవాజ్ ఖాన్ అన్నారు.

హర్యానాలో 3.5 లక్షల టన్నులు. ఉత్తరప్రదేశ్ మూడు లక్షల టన్నుల గోధుమ సేకరిస్తారు.

ప్రధానితో దినేష్‌సింగ్ చర్చలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

విదేశాంగమంత్రి శ్రీ దినేష్‌సింగ్ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీని నేడు కలుసుకున్నారు.

దార్-ఎస్-సలామ్‌లో జరిగిన అలీన దేశాల సన్నాహక సమావేశం విశేషాలను ప్రధానికి ఆయన వివరించాడు.

ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీని కాశ్మీర్ విద్యుత్‌శాఖ మంత్రి శ్రీ గెసుద్దీన్ కలుసుకుని రాష్ట్ర రాజకీయ పరిస్థితిని గూర్చి వివరించారు.

మిఠాయి తిని వాంతులు

హైదరాబాద్, ఏప్రిల్ 21

విషం కలిసిన మిఠాయి తిన్నట్లు అనుమానింపబడిన 200 మందిని నిన్న ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చేర్చారు. వారందరికీ తగిన చికిత్సచేసిన అనంతరం నేటి ఉదయం ఆస్పత్రినుండి పంపివేశారు. ఎవ్వరూ మరణించలేదు. వీరిలో చాలామంది హరిజనులు.

ఇమామ్‌పూరా, బియాగుడా ప్రాంతాలలో నిన్న మధ్యాహ్నం 1 గంటకు ఒక స్త్రీ వద్ద నుండి కిలో 1 కి రూపాయి చొప్పున మిఠాయిలను వీరంతా కొనుగోలు చేశారని ఆస్పత్రి రికార్డుల మూలంగా తెలుస్తున్నది. ఆ మిఠాయిలను తిన్నవెంటనే వారందరికీ విరేచనాలు, వాంతులు అయ్యాయి. పోలీసులు వారందరిని సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆస్పత్రికి తీసుకవచ్చారు. తగిన చికిత్స చేసిన అనంతరం ప్రాణాపాయం లేనందువల్ల వారందరిని నేటి ఉదయం విడుదల చేశారు.

మిఠాయిలు అమ్మిన స్త్రీని వారెవ్వరు గుర్తించలేక పోయారని పోలీసు అధికారి తెలియజేశారు. పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఇంతవరకు ఎవ్వరినీ అరెస్టు చేయలేదు.

బెంగాల్‌లో భద్రతా చర్యలు

కలకత్తా, ఏప్రిల్ 21

లెనిన్ శతజయంతి సందర్భంగా నక్సలైట్లు ఉద్యమ సంస్థాపన దినోత్సవాన్ని నక్సలైట్లు రేపు జరుపుతున్నారు. దీనితో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసింది.

కలకత్తాలో రేపు బ్రహ్మాండమైన ప్రదర్శన జరుగగలదని కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) నేడు ప్రకటించింది.

ఈ సందర్భంగా తమ విప్లవకర చర్యలను రుజువు పరచుకొనుటకై హింసాయుత చర్యలను తలపెట్టాలని వారు భావిస్తున్నట్లు గూఢచారిశాఖ తెలిపింది.

ప్రజాసమితి సామూహిక ఉద్యమం

హైదరాబాద్, ఏప్రిల్ 21

రైలు పట్టాలపై బైఠాయించడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు పనిచేయకుండా చూడటంలాంటి చర్యలు మే 1 వ తేదీ నుండి ప్రారంభమయ్యే మూడు రోజుల సామూహిక ఉద్యమంలో భాగంగా వుండగలవని తెలంగాణా ప్రజా సమితి నేడు ప్రకటించింది.

తెలంగాణా రాష్ట్రం కొరకు జరిగే ఉద్యమంలో యిది చిట్టచివరిదని, నిర్ణయాత్మకమైన దశయని ప్రజాసమితి పేర్కొన్నది.

ఈ ఉద్యమంలో దాదాపు 30 వేల మంది కార్యకర్తలు పాల్గొనగలరని ప్రజాసమితి భావిస్తున్నది. ఈ ఉద్యమానికి ప్రజాసమితి అధ్యక్షుడు శ్రీ చెన్నారెడ్డి నాయకత్వంవహిస్తారు.

మే 2, 3 తేదీలలో గూడ యీ ఉద్యమం జరుగుతుంది. కొందరు ప్రముఖ నాయకులు నాయకత్వం వహిస్తారు.

సామూహికరిలే నిరాహారదీక్షలతో ఉద్యమాన్ని ప్రారంభించాలని ప్రజాసమితి నిర్ణయించింది. ఈ నిరాహారదీక్షలు ఏప్రిల్ 26 వరకు కొనసాగగలవు

ఏప్రిల్ 27 నుండి ఏప్రిల్ 30 వరకు ఆందోళన, సత్యాగ్రహ రూపంలో జరుగుతుంది.

రు. 100 కోట్ల ఇంజనీరింగ్ పరికరాల ఎగుమతి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

భారతదేశం గత సంవత్సరం రు. 100 కోట్ల విలువగల ఇంజనీరింగ్ పరికరాలను విదేశాలకు ఎగుమతి చేసిందని విదేశ వాణిజ్య శాఖ మంత్రి శ్రీ బి. ఆర్. భగత్ నేడు లోక్‌సభలో తెలియజేశారు.

అంతకుముందు శ్రీ ఓంప్రకాశ్ త్యాగి ప్రశ్నకు సమాధానం చెపుతూ, సూయజ్ కాలువను మూసివేసిన ఫలితంగా కొన్ని ఆఫ్రికాదేశాలకు ఇంజనీరింగ్ పరికరాల ఎగుమతి పెరిగిందనటం సరికాదని అన్నారు.

ప్రపంచ మార్కెట్లలోని వస్తువులకన్నా భారత ఇంజనీరింగ్ పరికరాల నాణ్యత ఎక్కువగా వున్నదని అందుచేతనే ఎగుమతులు పెరిగాయన్నారు. ఇంజనీరింగ్ పరిశ్రమ ఉక్కు కొరతను ఎదుర్కొంటున్నదని చెప్పారు. ఉక్కు కొరత మూలంగా ఇంజనీరింగ్ పరికరాల ఎగుమతితగ్గిపోకుండా అన్నిచర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు.

1970-71 లో ఇ. సి. గ్రేడు అల్యూమినియం దూలాల ఎగుమతి విధానాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని శ్రీ యస్. యస్. కొఠారీ ప్రశ్నకు సమాధానంగాతెలియజేశారు.

బెంగాల్లో 8 పార్టీలచే ఉద్యమం ప్రారంభం

ఐక్యసంఘటన పునరుద్ధరణకై

కలకత్తా, ఏప్రిల్ 21

బెంగాల్లో 14 పార్టీల ఐక్యసంఘటనను పునరుద్ధరించటానికి, ఐక్యసంఘటన పరిపాలనా కాలంలో ప్రజలకు లభించిన విజయాలను రక్షించేందుకు, ప్రజాతంత్ర సోషలిస్టు శక్తులను ఐక్యపరచటానికి కృషిచేయాలని 8 పార్టీలు నిర్ణయించాయి.

ఐక్యసంఘటన ప్రభుత్వం విచ్ఛిన్నమవటానికి, పర్యవసానంగా రాష్ట్రపతిపాలన ఏర్పడటానికి దారితీసిన పరిస్థితులను ప్రజలకు వివరించే నిమిత్తం. సంయుక్తంగా ప్రచారాన్ని ప్రారంభించాలని 8 పార్టీలు నిర్ణయించాయి. 8 పార్టీలు అంగీకరించిన ఒప్పందం ప్రాతిపదికపై ఈ ప్రచారం కొనసాగుతుంది.

కమ్యూనిస్టుపార్టీ, ఫార్వర్డ్‌బ్లాక్, సోషలిస్టు యూనిటీసెంటరు, యస్. యస్. పి., పి. యస్. పి., గూర్ఖాలీగ్, రివల్యూషనరీ కమ్యూనిస్టుపార్టీ (తిరుగుబాటు) బోల్షివిక్ పార్టీల ప్రతినిధులు నేడిక్కడ సమావేశమై. నలుగురు సభ్యుల కమిటీచేసిన ప్రతిపాదనను కొన్ని మార్పులు చేర్పులతో అంగీకరించారు.

ఈ ప్రతిపాదనను అంగీకృత డాక్యుమెంటుగా తీసుకొనటం జరుగుతుందనిపార్టీ వర్గాలు తెలియజేస్తున్నాయి.

ఐక్యసంఘటన ప్రభుత్వం విచ్ఛిన్నానికి ప్రధాన కారణమైన మార్క్సిస్టుపార్టీ [illegible] పాత్రను, ప్రచారం సందర్భంలో ప్రజలకు వివరించాలని నిర్ణయించారు.

110 ట్రాక్టర్ల పంపిణీ

మద్రాసు ముఖ్యమంత్రిచే

మద్రాసు, ఏప్రిల్ 22

తమిళనాడు వ్యవసాయ పారిశ్రామిక సంస్థచే వాయిదాల వారీ చెల్లింపు పద్ధతిపై సరఫరా చేయబడిన 110 ట్రాక్టర్లను తమిళనాడు ముఖ్యమంత్రి శ్రీ కరుణానిధి నిన్న రైతులకు పంచారు.

ఆ సందర్భంగా జరిగిన సభలో శ్రీ కరుణానిధి మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం తగినన్ని ట్రాక్టర్లను కేటాయించకపోవటం విచారకరం అని అన్నారు.

ప్రస్తుత సంవత్సరంలో 2500 నుండి 3 వేల ట్రాక్టర్ల వరకు వ్యవసాయ పారిశ్రామిక కార్పొరేషన్‌కు లభించనున్నాయని 10 కోట్ల రూపాయలమేరకు జాతీయం చేయబడ్డ బ్యాంకులు కార్పొరేషన్‌కు అప్పులు ఇవ్వటానికి సంసిద్ధతను వ్యక్తపరిచాయని కార్పొరేషన్ అధ్యక్షుడు తెలిపారు.

అంగవికలులకు స్కాలర్‌షిప్‌లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

1969-70 లో 929 మంది అంగవికలులకు స్కాలర్‌షిప్పులు ఇవ్వటం జరిగిందని సాంఘిక సంక్షేమ మంత్రి డాక్టర్ ఫూల్ రేణుగుహ, శ్రీ చెంగల్రాయనాయుడుకు నేడు లోకసభలో తెలిపారు. ఇందుకుగాను 10 లక్షల 25 వేల రూపాయలు మంజూరు చేశామన్నారు.

సుగాలీ కాలనీకి ప్రారంభోత్సవం

చిలకలూరిపేట, ఏప్రిల్ 21

చిలకలూరిపేటలోని గాంధీనగర్ సుగాలీ కాలనీకి ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు ప్రారంభోత్సవం చేశారు.

స్థానిక రోటరీ క్లబ్బు, వరద నివారణ సహాయక కమిటీ వారిచే సంయుక్తంగా నిర్మించబడ్డ యీ కాలనీలో 63 ఇళ్ళు వున్నాయి. 126 కుటుంబాలకు వసతి సౌకర్యం వుంటుంది.

ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో యిప్పటికి 16 లక్షల ఎకరాల బంజర్లను పంచామని, మరో 5, 6 లక్షల ఎకరాలను పంచుతామని అన్నారు.

గిరిజన సంక్షేమం కొరకు రు. 20 లక్షలను కేటాయించటం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రు. 60 లక్షల ఖర్చుతో 50 గృహ నిర్మాణ పథకాలను చేపట్టటం జరుగుతుందన్నారు. వీటిలో 14 పథకాలను అనధికార సంస్థలు చేపట్టగలవని చెప్పారు.

జిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీ మేదూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ, జిల్లాలో 265 గ్రామాలలో రు. 12½ లక్షల వ్యయంతో హరిజనులకు, నిరుపేదలకు నివేశన స్థలాలను యివ్వటం జరుగుతుందన్నారు.

శ్రీ కాసు వెంగళరెడ్డి మాట్లాడుతూ హరిజనుల గృహవసతికి బడ్జెట్‌లో రు. 2 కోట్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

కాలనీలోనిర్మించిన ఎలిమెంటరీస్కూలును శ్రీమతి రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.

చినమానయ్య గ్రామంలోని 108 ఇళ్ళుగల కాలనీకి, తూబాడు గ్రామంలోని 110 ఇళ్లుగల కాలనీకి కూడ ముఖ్యమంత్రి నేడు ప్రారంభోత్సవం చేశారు.

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

పార్లమెంటుకు సార్వభౌమాధికారం వుండాలని, రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్‌చేస్తూ తూర్పు పాకిస్తాన్ జాతీయ అవామీపార్టీ (అలీఖాన్ గ్రూపు) నేడు పెద్ద ప్రదర్శన జరిపినట్లు పాక్‌రేడియో పేర్కొన్నది.

సెలవుల్లో ప్రత్యేక రైళ్లు

మద్రాసు, ఏప్రిల్ 21

వేసవిసెలవుల్లోవుండే రద్దీని తగ్గించేందుకు మే, జూన్, జూలై నెలల్లో ఢిల్లీ మద్రాసుల మధ్య ప్రత్యేక రైళ్ళను రైల్వేశాఖ నడుపనున్నది.

ప్రత్యేకరైళ్ళ టైంటేబుల్ ఈ క్రింది విధంగా వుంది:

మద్రాసు నుండి ఢిల్లీకి మేనెల 17, 19, 20, 26, జూన్‌నెల 2, 27, జూలైనెల మూడవతేదీన నడుపబడుతాయి.

న్యూఢిల్లీ నుండి మద్రాసుకు మేనెల 16, 17, 20, 23, 30, జూన్‌నెల 23, 30 జూలైనెల 6 తేదీలలో నడుపుతారు.

మద్రాసు నుండి రాత్రి 10-30 గంటలకు ఈ ప్రత్యేకరైళ్లు బయలుదేరి నాలుగవరోజు ఉదయం 5.05 గంటలకు ఢిల్లీ చేరుకుంటాయి

న్యూఢిల్లీనుండి బయలుదేరే రైళ్లు రాత్రి 10-30 కి బయలుదేరి నాల్గవరోజు ఉదయం 5 గంటలకు మద్రాసు చేరుకుంటాయి.

గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్‌సహాయం

లోక్‌సభలో మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22

గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ యిస్తున్న ప్రోత్సాహం మూలంగా చాలా గ్రామాల్లో విద్యుదీకరణకు అవకాశాలు ఏర్పడుతాయని నేడు లోక్‌సభలో నీటిపారుదల, విద్యుత్‌శాఖ మంత్రి శ్రీ కె.ఎల్. రావు తెలియజేశారు.

తక్కువ వడ్డీ రేటుపై అప్పులు. దానిని సరళమైన వాయిదాల్లో చెల్లించే పద్ధతి తదితర సౌకర్యాలను గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ కల్పిస్తున్నదని మంత్రి అన్నారు.

విద్యుత్ ఛార్జీలు విపరీతంగా వున్నందువల్ల మహారాష్ట్రలో రైతులు విద్యుత్ మోటార్లకన్నా, డీజిల్ యింజన్లకే ఎక్కువ ప్రాధాన్యత యిస్తున్నారని శ్రీ పి. వెంకటసుబ్బయ్య వెల్లడించిన అభిప్రాయాలతో మంత్రి ఏకీభవించలేదు.

విద్యుత్ రేట్లు యూనిట్‌కు 12 నుండి 15 పైసలవరకు వున్నదని వాటిని తగ్గించేందుకు ప్రయత్నిస్తామని ఆయన అన్నారు.

బొకారో నిర్మాణం పని అప్పగింత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

బొకారో ఉక్కు కర్మాగారాన్ని విస్తరణ రెండవదశ నిర్మాణం పనిని కేంద్ర ఇంజనీరింగ్ డిజైన్ బ్యూరోకు అప్పగించటం రాజకీయ దురుద్దేశంతో కూడుకుని వున్నదని నేడు లోక్‌సభలో కొందరుసభ్యులు గావించిన ఆరోపణను ఆర్థికశాఖ స్టేట్‌మంత్రి శ్రీ కె.సి. పంత్ తిరస్కరించారు.

దస్తూర్ అండ్ కంపెనీ ఆ నిర్మాణం మొత్తం పనిని నిర్వహించగలవని బొకారో ఉక్కు సంస్థ మాజీ అధ్యక్షుడు ఒక సిఫారస్సును ప్రభుత్వానికి 1970 జనవరిలో సమర్పించారన్న విషయం వాస్తవమేనా అని శ్రీ సమరగుహ ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్ణయం ఏటి రాజకీయ అభిప్రాయాలతోను గావించబడింది కాదనీ, కాబట్టి ఈ అభిప్రాయభేదం అనవసరమైనదని మంత్రి చెప్పారు.

స్టెయిన్‌లెస్ స్టీల్ కర్మాగారం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21

సేలం ఉక్కు కర్మాగారం రెండవ దశలో స్టెయిన్‌లెస్ స్టీలును కూడా ఉత్పత్తి చేయగలదని ఉక్కుశాఖ స్టేట్ మంత్రి శ్రీ పంత్ లోక్‌సభలో ఒక లిఖిత పూర్వక సమాధానంలో తెలిపారు.

దుర్గాపూర్ ఉక్కు కర్మాగారాన్ని మిశ్రమ ఉక్కు తయారు చేసేందుకు వీలుగా విస్తరింప జేయదలిచామని మంత్రి అన్నారు.

మిశ్రమ ఉక్కు తయారుచేసే కర్మాగారాన్ని ఏర్పాటుచేయవలసిందిగా తమిళనాడు ప్రభుత్వం కోరలేదని, మిశ్రమ ఉక్కు, స్టెయిన్‌లెస్‌స్టీల్‌లకుమద్రాసుకు లైసెన్సులను ఇవ్వవల్సిందిగా మాత్రం కోరిందని మంత్రి చెప్పారు.

చైబాసా ఘటనలపై న్యాయ విచారణ

పాట్నా, ఏప్రిల్ 22

చైబాసాలో శ్రీరామనవమి రోజు జరిగిన ఘటనలపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని, బీహార్‌లోని అన్ని అధికార పార్టీలు గత రాత్రి నిర్ణయించాయి.

సమావేశానికి ముఖ్యమంత్రి శ్రీ దరోగ ప్రసాద్‌రాయ్ అధ్యక్షత వహించారు.

ప్రజల్లో విశ్వాసం కలిగేందుకు అట్టి విచారణ అవసరమని సమావేశం అభిప్రాయపడింది.

విచారణకు ఒకటి రెండు రోజులలో ఆదేశాలు జారీ అవుతాయి.

కాజీ మాన్యం పాకల పీకివేత

గుంటూరు, ఏప్రిల్ 21

ఈరోజు మధ్యాహ్నం గుంటూరు రిజర్వు పోలీసులు, ప్రత్యేకంగా పిలిపించబడ్డ పోలీసులు కాజీ మాన్యం ప్రదేశానికి వెళ్ళి నిరుపేదలు వేసుకున్న పాకలను పీకివేశారు.

మధ్యాహ్నం 12 గంటలకు నాలుగు వ్యానులలో రిజర్వు పోలీసులు, ప్రత్యేకంగా పిలిపించబడ్డ పోలీసులు, లారీలలో కొందరు కూలీలను, మఫ్టీ దుస్తులలో వున్న పోలీసులను తీసుకుని మాన్యం ప్రాంతానికి వెళ్ళారు. దాదాపు 1½ ఫర్లాంగుల దూరంలో ప్రజలను ఎవ్వరినీ రానీకుండా కాపలాకాసి 2 గంటల వరకు పాకలను పీకివేశారు.

పోలీసులు వెళ్ళగానే ప్రజలు తిరిగి పాకలను వేసుకున్నారు.

పోలీసుల కాల్పుల సందర్భంగా అరెస్టు చేసిన శ్రీ మాలకొండయ్య (పట్టణ కమ్యూనిస్టు సమితి సభ్యుడు) తదితరులను జామీనుపై యీ రోజు సాయంత్రం విడుదల చేశారు.

ఇంజన్ లేకనే గూడ్సుబండి ప్రయాణం

హైదరాబాద్, ఏప్రిల్ 21

సికింద్రాబాద-వాడి సెక్షన్‌లో గడ్డంగూడ-మైలారం రైల్వే స్టేషన్ల మధ్య నిన్న 30 గూడ్సు పెట్టెలు ఇంజన్ లేకుండా 6 మైళ్ళు దూరం తమంతట తాముగా ప్రయాణం చేశాయి.

మైలారం రైల్వే స్టాఫ్ సకాలంలో చర్య తీసుకొని, ఆ పెట్టెలను పట్టాలు తప్పించడం వలన [illegible]. సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌తో ఆ పెట్టెలు ఢీ కొనే ప్రమాదం నివారించబడింది.

ఇంజన్ లేని ఈ రైలు ప్రయాణం సమయంలో మైలారం స్టేషన్ వద్ద లైన్ దాటుతున్న ఒక రైల్వే ఉద్యోగి పైగా పోయాయి. అంతిమంగా ఆ ప్రయాణం ఆగిన సమయంలో 17 వ్యాగన్‌లు పట్టాలు తప్పాయి, పెట్టెలు బాగా దెబ్బతిన్నాయి.

ఈ గూడ్స్ రైలు ఇంజన్‌ను నీరు, బొగ్గు నిమిత్తం వికారాబాద్ తీసుకెళ్ళారు. తిరిగి గడ్డంగూడ చేరి పెట్టెలు తగిలించుకునే సమయంలో పెట్టెలు తగిలించక ముందే గట్టిగా గుద్దింది. దానితో ఆ 30 పెట్టెలు పల్లంగా వున్న మార్గంలో అతి వేగంగా వెనక్కు ప్రయాణం చేశాయి. వాటిని ఆపడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనవని రైల్వే వర్గాలు తెలిపాయి.

గడ్డంగూడ స్టేషన్‌మాస్టరు, డ్రైవరు, గార్డులపైన, వ్యాగన్‌ల పగుళ్ళను చూడనందుకు పాయింట్స్‌మన్ పైన "సమిష్టి అలక్ష్యం" క్రింద రైల్వేపోలీసులు కేసు రిజిష్టరు చేశారు.

ఆస్ట్రియా ప్రభుత్వ రాజీనామా

వియన్నా, ఏప్రిల్ 22

ఆస్ట్రియా ప్రభుత్వం నేడు రాజీనామా చేసింది.

మంత్రివర్గం నేడు గం. 12.30 కు ఈ నిర్ణయం తీసుకున్నది.

ఆ తర్వాత అండర్ ఛాన్సలర్ జోసెఫ్ కలాయుస్ మంత్రివర్గ రాజీనామాను అధ్యక్షుడు ఫ్రాంజ్‌జోనస్‌కు సమర్పించాడు.



ఫార్గో
గేస్ మేంటిల్స్
ప్రకాశవంతమైన వెలుతురుకు
చిరకాల మన్నికకు
తయారుచేయువారు:
ఫార్గో మ్యాంటిల్ ప్రొడక్ట్సు
సర్వోదయ భువన్, 38/40 ఆదర్శ కాలనీ,
లిబర్టీ గార్డెన్ దగ్గర, మల్లాడ్ (పశ్చిమ) బొంబాయి-64 (యన్.బి.)



విశ్రాంతి పొందండి!
చార్మినార్ త్రాగండి.
అచ్చమైన మేలిరకం పొగాకుల
పరిమళము కమ్మదనం అనుభవించండి.
చార్మినార్ సిగరెట్లు రుచియే ఇండియాలో
అది విశేషంగా అమ్ముటకు కారణం.
CMVS-6-253


4వ వారం
మిస్ ఇండియా వహీదారెహమాన్ అపూర్వ నాట్యప్రదర్శన!
మనోహరమైన వహీదానాట్యాలు మీకు చూడాలనివుందా?
మీ ఇంట్లోవారికి విదేశాలు చూపించాలనుకుంటున్నారా?
అయితే-కుటుంబసమేతంగా రండి! చూడండి—
ప్రేమపూజారి
దేవానంద్ * ఎస్.డి.బర్మన్ * ఫాలిమిస్త్రి
శ్రీవెంకట రమణా రిలీజ్

మే 1వ తేదీన భూసంస్కరణల దినం

కిసాన్ సభ శాఖలకు శ్రీ వై. వి. కృష్ణారావు పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 22

బరాసాత్‌లో ఇటీవల జరిగిన అఖిలభారత రైతు మహాసభ నిర్ణయం మేరకు మే 1వ తేదీన "భూసంస్కరణల దినం"గా పాటించవలసిందిగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ అధ్యక్షుడు శ్రీ వై. వి. కృష్ణారావు నేడిక్కడ ప్రకటించారు.

అదే రోజున తాలూకా, జిల్లా కేంద్రాల్లో ఊరేగింపులను, సభలను జరపవలసిందిగా కోరారు.

వీలైనన్ని కేంద్రాలలో ఉత్సవాలు జరపటానికి అన్ని ఏర్పాట్లు గావించవలసిందిగా అన్నిజిల్లా, తాలూకాల రైతు సంఘాలకు శ్రీ కృష్ణారావు విజ్ఞప్తిచేశారు. అఖిల భారత రైతు మహాసభ, భూసంస్కరణలపై చేసిన తీర్మానాలను వివరించవలసిందిగా ఆయన కోరారు.

ఈ సందర్భంగా ప్రదర్శనలను విశాల ప్రాతిపదికపైన నిర్వహించటానికిగాను కలిసివచ్చే యితర పార్టీల, సంస్థల సహకారాన్ని పొందవలసిందిగా కిసాన్‌సభ శాఖలన్నిటిని ఆయన కోరారు.



శర్మ మృతికి శ్రీ గౌడ్ సంతాపం

హైదరాబాద్, ఏప్రిల్ 22

విశాఖపట్నం ట్రేడ్ యూనియన్లు ముఖ్యంగా రేవు కార్మికుల నాయకులు శ్రీ ఎం. భద్రమూర్తిశర్మ మృతికి ఎ. ఐ. టి. యు. సి. సంతాపాన్ని ప్రకటిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ రాజ్‌బహదూర్‌గౌడ్ నేడొక పత్రికా ప్రకటనలో తెలియచేశారు.

విశాఖపట్నంలో ట్రేడ్‌యూనియన్‌లను నిర్మించిన వారిలో శ్రీ శర్మ ఒకరు. ఆయన అనేక కార్మిక పోరాటాలకు నాయకత్వం వహించారు. పోర్టుట్రస్టుసభ్యులుగా శ్రీశర్మను ఎన్నుకొని రేవుకార్మికులు ఆయన సేవలను గౌరవించారని శ్రీ గౌడ్ పత్రికా ప్రకటనలో తెలియచేశారు.

"శ్రీ శర్మ మృతివల్ల మనం ప్రముఖ ట్రేడ్‌యూనియన్ నాయకుని, పట్టుదలగల విప్లవకారుని పోగొట్టుకున్నాము. ఆయన సంస్మరణార్థం అరుణ పతాకాన్ని అవనతం చేస్తున్నాము. ఆయన ఏ లక్ష్యంకై దృఢదీక్షతో పోరాడారో, ఆ లక్ష్యసాధనకు పాటుపడగలమని ప్రతిన చేస్తున్నామని" ప్రకటనలో శ్రీ గౌడ్ పేర్కొన్నారు.

తమిళనాడు శాసన మండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం

మద్రాసు, ఏప్రిల్ 22

21 మంది తమిళనాడు శాసనమండలి సభ్యులచేత శాసనమండలి డిప్యూటీ చైర్మన్ శ్రీ టి. కృష్ణమూర్తి నేడు ప్రమాణస్వీకారం చేయించారు.

వెనుకబడిన వర్గాల మంత్రి శ్రీ యన్. వి. నటరాజన్‌తోసహా 18 మంది ఇటీవల జరిగిన శాసనమండలి ద్వైవార్షిక ఎన్నికలలో ఎన్నికయ్యారు. తక్కిన వారిని నామినేట్ చేయటం జరిగింది.


త్రీలను విశేషంగా ఆకర్షిస్తున్న చిత్రం. సకుటుంబంగా చూడదగిన నీతిదాయకమైన చిత్రం. తొలిసారిగా గోదావరి లోయా, పాపి కొండల దృశ్యాలను రంగులలో రమణీయంగా చిత్రీకరింపబడిన చిత్రం. "అమ్మకోసం"
5వ వారం
అంజలీదేవి సమర్పించు
చిన్నీబ్రదర్స్ వారి
అమ్మకోసం
కథ-డైరెక్షన్: బి.వి.ప్రసాద్
సంగీతం: ఆదినారాయణరావ్
నిర్మాత: చిన్నారావ్ B.E., B.S.I.E.,(U.S)
లక్ష్మీ ఫిలింస్ రిలీజ్
LAKSHMI



శ్రీగౌతమ్ పిక్చర్స్ వారి
ఆలీబాబా 40 దొంగలు
వీర, శృంగార హాస్యరస ప్రధానమైన మహోజ్జ్వల చిత్రం!
20వ రోజు
దర్శకత్వం బి.విఠలాచార్య
నిర్మాత. యన్.రామబ్రహ్మం
డిస్ట్రిబ్యూటర్స్: ఆంధ్ర: గౌతమ్ పిక్చర్స్, సీడెడ్: విజయా పిక్చర్స్
నైజాం: శ్రీనేషనల్ ఆర్ట్ పిక్చర్స్, మైసూరు: సదరన్ మూవీస్
VIJAYA


మీ ఆశీసులతోనే ఈ చిత్రం విజయాన్ని సాధించింది! ఈ శుభసమయాన అశేష ఆంధ్ర సోదర సోదరీమణులకు హృదయ పూర్వక ప్రణామాలు! నాతో సహకరించిన నటీనటవర్గానికి సాంకేతిక నిపుణులకు పద్మాంజలి ఘటిస్తున్నాను.
50వ రోజు
పద్మనాభం సమర్పించు రేఖా & మురళీ ప్రొడక్షన్స్ వారి
కథానాయిక మొల్ల
తారాగణం: వాణిశ్రీ, గీతాంజలి, హేమలత, జ్యోతిలక్ష్మి, బేబీ ప్రమీలారాణి, నిర్మల, రాధాకుమారి, పుష్పకుమారి
గుమ్మడి, నాగభూషణం, పద్మనాభం, రాజబాబు, మిక్కిలినేని, అల్లురామలింగయ్య, కోళ్ళసత్యం, రామచంద్రరావు, పెరుమాళ్ళు, వల్లం నరసింహారావు, పెద్దన్న, రాజకుమార్, సత్యనారాయణ, నల్లరామమూర్తి, శేషయ్య, గణేష్, హనుమంతరావు, మాస్టర్ మురళి.
అతిథినటులు: హరనాథ్ & ప్రభాకరరెడ్డి.
సాంకేతిక వర్గం:
కథ: ఇంటూరి వెంకటేశ్వరరావు గారు రచించిన "కుమ్మరి మొల్ల" ఆధారం.
మాటలు: బి.యల్.యన్.ఆచార్య, ఆదుర్తి నరసింహామూర్తి, అప్పలాచార్య.
పాటలు: దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి, సి.నారాయణరెడ్డి, కొసరాజు, అప్పలాచార్య, విజయనరసింహా, అరుల్‌ప్రకాష్, శ్రీనివాస్. ఛాయాగ్రహణం: సెల్వరాజు. కూర్పు: బి.హరినారాయణ.
నృత్యం: పసుమర్తి, కె.యస్.రెడ్డి, తంగప్పు, చిన్నిసంపత్, రాజు, శేషు. కళ: అనంతరామ్.
జె.సత్యనారాయణ. సీతాంబరం, పోతరాజు, పి.కృష్ణ, మాధవయ్య, నరసింహులు
బి.వి.రామచంద్రరావు. బి.హనుమంతరావు. ఎస్.వి.చలపతిరావు. రాధాకృష్ణమూర్తి
నిర్మాత: బి.పురుషోత్తం. సంగీతం: S.P. కోదండపాణి. దర్శకత్వం: బి.పద్మనాభం.
లక్ష్మీ ఫిలింస్ రిలీజ్
స్టూడియో ప్రసాద్.

విశాలాంధ్ర విజ్ఞానసమితి తరఫున ప్రింటర్ అండ్ పబ్లిషర్ : టి. వెంకటేశ్వరరావు. ఎడిటర్ : వేములపల్లి శ్రీకృష్ణ. ముద్రణ : స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, విజయవాడ.